నేటి కందం- నేటికి అందం



ఉచితముగ బస్ ప్రయాణము
రుచిరమ్ముగ మహిళలకిడ రోచిర్మయుడై
ప్రచలిత భోగచయంబుల
నచలాత్ముండైన యభవు దాంధ్రమున కిడున్ !!

(ఆగస్టు 15 నుండి ఆంధ్రప్రదేశ్ లో మహిళలకు ఉచిత బస్ ప్రయాణం)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం
తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

చురక

పక్కలోని బల్లెము
పాక్ మనకు నిత్యం
పోనీయని వదిలేస్తే
పొడుస్తుంది సత్యం.
అణ్వస్త్రం బ్లాక్ మేల్
అదరగొట్ట చూస్తుంది
యుద్ధ కాంక్ష ఉగ్రవాద
ఉనికిని రాజేస్తుంది



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ శుక్రవారం 15-8-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :32 సంచిక:11 పేజీలు:6 వెల: రూ.1/-


# ఆపరేషన్ సిందూర్.. అధికారులకు గ్యాలంటరీ అవార్డులు ప్రకటించిన కేంద్రం..!

న్యూఢిల్లీ, ఆగష్టు 14:స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ భద్రత కోసం ప్రాణాలను పణంగా పెట్టిన సైనికులకు కేంద్రం అవార్డులను ప్రకటించింది. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 16 మంది సరిహద్దు భద్రతా దళ (బీఎస్ఎఫ్) సిబ్బందికి వారి ధైర్యసాహసాలు, అజేయమైన ధైర్యం, విధి పట్ల అంకితభావానికి కేంద్ర ప్రభుత్వం శౌర్య పతకాలను ప్రకటించింది. ఈ సైనికులందరూ పాకిస్తాన్‌పై భారత్ నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్'లో పాల్గొన్నారు.

కొంతమంది సైనికులు శత్రువుల డ్రోన్లపై దాడి చేసి నేలమట్టం చేశారు. బీఎస్ఎఫ్ 2,290 కిలోమీటర్ల పొడవైన ఇండో-పాక్ అంతర్జాతీయ సరిహద్దులో గస్తీ నిర్వహిస్తుంది.

పశ్చిమ భాగంలో నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) వద్ద సైన్యంతో పాటు బీఎస్ఎఫ్‌ను మోహరించింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో సిబ్బంది దృఢ సంకల్పం, అచంచల ధైర్యాన్ని ప్రదర్శించారని బీఎస్ఎఫ్ పేర్కొంది. వైస్ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్ ఎయిర్ మార్షల్ నరనందేశ్వర్ తివారీ, వెస్ట్రన్ ఎయిర్ కమాండర్ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా, డీజీ ఎయిర్ ఆపరేషన్స్ ఎయిర్ మార్షల్ అవధేష్ భారతితో సహా నలుగురు భారత వైమానిక దళ అధికారులకు ఉత్తమ యుద్ధ సేవా పతకాన్ని ప్రదానం చేయనున్నారు. భారత సైన్యంలోని నలుగురు అధికారులకు కీర్తి చక్ర, ఎనిమిది మంది అధికారులకు శౌర్య చక్రను ప్రదానం చేయనున్నారు.

ఆపరేషన్ సిందూర్ సమయంలో ఖచ్చితమైన దాడులు చేయడం, మన గగనతలాన్ని రక్షించడంలో కీలక పాత్ర పోషించినందుకు భారత వైమానిక దళానికి చెందిన 13 మంది అధికారులకు ప్రతిష్టాత్మక యుద్ధ సేవా పతకాలను ప్రకటించారు. ఎయిర్ వైస్ మార్షల్ జోసెఫ్ సువారెస్, ఏవీఎం ప్రజువల్ సింగ్, ఎయిర్ కమాండర్ అశోక్ రాజ్ ఠాకూర్ ఉన్నారు.

ఆపరేషన్ సిందూర్‌లో ఉగ్రవాద సంస్థ ప్రధాన కార్యాలయాలు, సైనిక స్థావరాలను ధ్వంసం చేసిన తొమ్మిది మంది భారత వైమానిక దళ అధికారులకు వీర్ చక్ర అవార్డులను ప్రకటించారు.

ఇది మూడవ అత్యున్నత శౌర్య పతకం. ఈ ఆపరేషన్‌లో భారత వైమానిక దళం కనీసం ఆరు పాకిస్తానీ విమానాలను కూల్చివేసింది. పాకిస్తాన్‌లోని లక్ష్యాలను ఛేదించే మిషన్లలో పాల్గొన్న ఫైటర్ పైలట్లు.. పాకిస్తాన్ దాడులను తిప్పికొట్టిన ఎస్-400, ఇతర వైమానిక రక్షణ వ్యవస్థలను అద్భుతంగా నిర్వహించిన అధికారులు, సైనికులు సహా భారత వైమానిక దళానికి చెందిన 26 మంది అధికారులకు, వైమానిక దళ సభ్యులకు వైమానిక దళ పతకం (శౌర్యం) ఎంపిక చేశారు. ఔ

అలాగే, 21 మంది సీబీఐ అధికారులకు విశిష్ట సేవల కింద రాష్ట్రపతి పోలీస్ పతకం, మెరిటోరియస్ సర్వీస్ కోసం పోలీస్ పతకం ప్రదానం చేయనున్నారు. కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఈ సారి 1,090 మంది పోలీస్ సిబ్బంది వివిధ విభాగాల్లో పతకాలను ప్రకటించింది.

# హైదరాబాద్‌లో డ్రగ్స్ కలకలం.. వ్యక్తి అరెస్ట్

హైదరాబాద్, ఆగష్టు 14: హైదరాబాద్ నగరంలో మరోసారి డ్రగ్స్ కలకలం సృష్టించాయి. 75 గ్రాముల ఎండీఎంఏ కలిగి ఉన్న ఓ వ్యక్తిని మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. డ్రగ్స్ కలిగి ఉన్న వ్యక్తిని రజాక్‌గా పోలీసులు గుర్తించారు. ఇతను ఎల్లారెడ్డిగూడ ప్రాంతానికి చెందిన వ్యక్తి అని నిర్ధారించారు.

రజాక్ ఎన్ని రోజుల నుంచి డ్రగ్స్ దందా కొనసాగిస్తున్నాడు.. ఎక్కడ్నుంచి కొనుగోలు చేస్తున్నాడు.. ఎవరెవరికి విక్రయించాడు అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. డ్రగ్స్ దందా కొనసాగిస్తున్న వారి పట్ల పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు.

# మాచైల్ మాతా యాత్ర మార్గంలో ఘోరం.. 38 మంది మృతి



శ్రీనగర్, ఆగస్ట్ 14: జమ్మూకాశ్మీర్ కిష్టావర్ జిల్లా పద్దార్ సబ్ డివిజన్ పరిధిలోని చిషోటీ గ్రామ పరిసర ప్రాంతంలో గురువారం మేఘ విస్ఫోటనం సంభవించింది. ఈ కారణంగా సంభవించిన మెరుపు వరదలతో 38 మంది మరణించారు. 75 మంది తీవ్రంగా గాయపడ్డారు. మాచైల్ మాతా యాత్ర మార్గంలో ఈ గ్రామం ఉండడంతో మృతుల సంఖ్య మరింతగా పెరగవచ్చని ప్రభుత్వ అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న జిల్లా యంత్రాంగం ఆ ప్రాంతానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టింది. ఇక క్షతగాత్రులను మెరుగైన వైద్య చికిత్స కోసం జిల్లా ప్రభుత్వాసుపత్రికి జిల్లా యంత్రాంగం తరలించింది. మరో 70 మందిని సహాయక బృందాలు రక్షించాయి. మేఘ విస్ఫోటనం అనంతరం చోటు చేసుకున్న పరిణామాలపై గవర్నర్, సీఎంలతో కేంద్ర మంత్రి అమిత్ షా ఫోన్ చేసి మాట్లాడారు.

అలాగే ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, భద్రతా దళాలు, పోలీసులు సంయుక్తంగా ఈ సహాయక చర్యల్లో పాల్గొన్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. అయితే ఈ వర్షాల కారణంగా మరణించిన వారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కిష్టావర్ డిప్యూటీ కమిషనర్ పంకజ్ కుమార్ శర్మ సహాయక చర్యలను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

ఈ ఘటనపై జమ్మూకాశ్మీర్ గవర్నర్ మనోజ్ సిన్హా స్పందించారు. భారీ వరద కారణంగా 12 మంది మరణించడంపై ఆయన గ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. అలాగే సహాయక చర్యలు తీసుకోవాలంటూ పౌర, పోలీస్, ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ అధికారులకు గవర్నర్ కీలక ఆదేశాలు జారీ చేశారు.

ఇంకోవైపు దేశ రాజధాని ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్‌లో ఎడతెరపి లేని భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ రోజు అంటే గురువారం ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో మరింతగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఇక హిమాచల్ ప్రదేశ్ అంతటా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రాష్ట్రంలో రుతుపవనాలు ప్రవేశించిన నాటి నుంచి ఇప్పటివరకూ 241మంది మరణించారని ఆ రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. వారంతా.. వర్షాధార విపత్తులతోనే మరణించారని వివరించింది.

## ఆగస్టు 15 న ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో దేశభక్తి ప్రదర్శనలతో

# జాతిని ఉత్తేజపరచనున్న సాయుధ దళాలు, సీఏపీఎఫ్, ఆర్పీఎఫ్, ఎన్సీసీ బ్యాండ్లు

న్యూఢిల్లీ, ఆగష్టు 14:భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా, దేశ రాజధాని ఢిల్లీలోని ప్రసిద్ధ ప్రదేశాలలో సాయుధ దళాల బ్యాండ్‌లు, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ (సీఏపీఎఫ్) బ్యాండ్‌లు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) బ్యాండ్‌లు, నేషనల్ క్యాడెట్ కోర్ (ఎన్సీసీ) బ్యాండ్ల ప్రత్యక్ష ప్రదర్శనలు జరగనున్నాయి. ఈ సంగీత కార్యక్రమాలు జాతీయ ఉత్సవాలకు ఒక లయను, ఔన్నత్యాన్ని జోడించి, స్ఫూర్తిదాయకమైన రాగాలు, క్రమశిక్షణతో కూడిన కళా ప్రదర్శనల ద్వారా ప్రజలకు చిరకాలం గుర్తుండిపోయేలా దేశభక్తి స్ఫూర్తిని అనుభూతి చెందే అవకాశాన్ని కల్పిస్తాయి. భారతదేశంలో సైనిక బ్యాండ్‌లు వలస పాలన కాలం నుంచి తమ ప్రత్యేకతను చాటుకుంటున్నాయి. కాలక్రమేణా జాతీయ ఐక్యత కు, గౌరవానికి చిహ్నంగా మారాయి. దశాబ్దాలుగా, సైనిక, నావిక, వైమానిక దళాల, వాటి అనుబంధ విభాగాల బ్యాండ్‌లు జాతీయ ఉత్సవాలు, విజయాలు, ప్రత్యేక లాంఛనాల సందర్భాలలో అంతర్భాగంగా ఉన్నాయి. ప్రభుత్వ ప్రత్యేక కార్యక్రమాలు, అధికార పర్యటనలు, స్మారకోత్సవాలలో ఈ బ్యాండ్‌లు శౌర్యం, త్యాగం, శాంతిని ప్రతిబింబించే సంగీత ధ్వనులను అందిస్తాయి. వాటి కచ్చితత్వం, క్రమశిక్షణ, సంగీత నైపుణ్యం అవి ప్రాతినిధ్యం వహించే సేవా విభాగాల నైతిక విలువలను సూచిస్తాయి.

సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, ఐటీబీపీతో సహా దేశంలోని వివిధ పారామిలటరీ, పోలీసు దళాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సీఏపీఎఫ్ బృందాలు సంప్రదాయాన్ని ఆధునికతతో మిళితం చేస్తూ ఉత్సవ సందర్భాలకు తమ ప్రత్యేక బాణీని జోడిస్తాయి. ఆర్పీఎఫ్ బ్యాండ్ రైల్వేకు రక్షణ స్ఫూర్తిని తీసుకువస్తే, ఎన్సీసీ యువజన విభాగంగా, తన సొంత బ్యాండ్ ప్రదర్శనల ద్వారా యువతలో దేశభక్తిని పెంపొందిస్తుంది.

### జాతీయ ఐక్యతను మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు - 2025

ఈ ఏడాది సంప్రదాయ వేదికలతో పాటు ఢిల్లీలోని ప్రధాన బహిరంగ ప్రదేశాలు, పార్కులు, సాంస్కృతిక కేంద్రాల్లో కూడా బ్యాండ్ల ప్రత్యక్ష ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. దేశభక్తి గీతాలు, మార్షల్ మ్యూజిక్, శాస్త్రీయ కృతులతో కూడిన సంపన్న సంగీత ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించనున్నాయి. ఇవి దేశం పట్ల గర్వభావాన్ని, జాతీయ సమైక్యతా భావనను ప్రేరేపించనున్నాయి.

సాయుధ దళాలు, సీఏపీఎఫ్, ఆర్పీఎఫ్, ఎన్సీసీ బ్యాండ్ ప్రదర్శనలు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గౌరవించడమే కాకుండా ఐక్యత, దేశభక్తి స్ఫూర్తిని బలపరుస్తాయి. ఆహ్లాదకరమైన, ఉత్తేజభరిత సంగీతం భారతదేశ వైవిధ్య మైన వారసత్వాన్ని, దాని సంరక్షకుల క్రమశిక్షణతో కూడిన అంకితభావాన్ని గుర్తు చేస్తుంది. ఢిల్లీలో జరిగే బ్యాండ్ ప్రదర్శనలు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను మరింత ప్రతిష్ఠాత్మకంగా మార్చే దేశవ్యాప్త ప్రయత్నంలో భాగం.

# పరిసరాల పరిశుభ్రతపై దృష్టి: కమిషనర్ లింగస్వామి



యాదగిరిగుట్ట, ఆగస్టు 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: వర్షాకాలం లిస్టులో పెట్టుకొని వందరోజుల ప్రణాళికలు భాగంగా పారిశుధ్యం పై కూడా ప్రధాన దృష్టి కేంద్రీకరించినట్లు యాదగిరిగుట్ట మున్సిపల్ కమిషనర్ లింగస్వామి తెలిపారు ఇన్చార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ లో వార్డ్ ఆఫీసర్ కవిత జవాన్ బూడిద కుమార్ తదితరులు మురికి ప్రదేశాలపై బ్లీచింగ్ పౌడర్ చల్లే కార్యక్రమం చేపట్టారు.

# మేడ్చల్ జిల్లాలో దేశ విభజన గాయాల స్మారక దినం




మేడ్చల్ ఆగష్టు 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );రాష్ట్ర బాజపా ఆదేశాల మేరకు మేడ్చల్ జిల్లాలో నాగారం మున్సిపాలిటీలోని రాంపల్లి చౌరస్తా ఆవరణలో.. అఖండ భారత్ సంకల్ప దివస్ జిల్లా అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా కన్వీనర్ గాలి సంపత్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గాలి సంపత్ యాదవ్ మాట్లాడుతూఅఖండ భారత్ సంకల్ప దివస్ ఆగస్టు14 సందర్భంగా దేశ విభజన సమయంలో నెలకొన్న భయానక పరిస్థితుల్లో ప్రాణ త్యాగాలు చేసిన వారికి నివాళులు అర్పించాలని నాటి విషాద పరిస్థితుల్లో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వాటిని తట్టుకొని నిలబడిన వారి ధైర్య సాహసాలకు శతకోటి వందనాలు అంటూ.. ఈరోజును భారతదేశపు యొక్క ఏకత్వం, సాంస్కృతిక, సమగ్రత, చారిత్రక, వారసత్వంను గుర్తు చేసుకునే సందర్భంగా ఈరోజు ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు,ముఖ్యంగా..చరిత్ర గుండెల్లో మరుపురాని మారణ హోమం..మతం నీడలో విడిపోయిన సౌభ్రాతృత్వం..లక్షల మంది ప్రాణాలను హరించిన దుర్దినం.. అఖండ భారతం ముక్కలైన చీకటి దినం..భరతమాత హృదయాం తరాల్లో మానని శాశ్వత గాయం. .భారత ఉపఖండ విభజన (1947) సమయంలో జరిగిన విపరీతమైన హింస, జాతిపరమైన హింసాచారాలు, సామూహిక వలసలు, మరియు మానవీయ నష్టాలను గుర్తుచేసుకోవడం. లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయారు, కోటి మందికిపైగా తమ గృహాలను విడిచిపెట్టి వలస వెళ్లాల్సి వచ్చిందన్నారు. 2021లో భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ దినోత్సవాన్ని ప్రకటించారు, దీని ముఖ్య ఉద్దేశం: దేశ విభజన వల్ల ఎదురైన బాధలను జ్ఞాపకం చేసుకోవడం, సమాజంలో శాంతి, ఏకతా, సామరస్యానికి ప్రాధాన్యత ఇవ్వడం, కొత్త తరాలకి చరిత్రని తెలియజేయడంవిభజన వల్ల జరిగిన దుర్ఘటనల్ని మరిచిపోకుండా ఉండటం.. పాఠశాలలు, కళాశాలలు, మ్యూజియమ్‌లు, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు విభజనపై ఆధారపడి చిత్ర ప్రదర్శనలు, డాక్యుమెంటరీలు బాధితుల జ్ఞాపకార్థం ప్రార్థనలు, చరిత్రపై అవగాహన పెంచే కార్యక్రమాలు చెయ్యాల్సిన అవసరం ఉంది,విభజన సమయంలో అసువులు బాసిన స్వాతంత్రోద్యమ వీరులందరికీమా ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం కంటెస్టెంట్ ఎమ్మెల్యే ఏనుగు సుదర్శన్ రెడ్డి గారు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కొమ్మిడి శోభా దామోదర్ రెడ్డి నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి ,జిల్లా నాయకులు హైమా రెడ్డి , బోడ శ్రీనివాసరావు , మాజీ కౌన్సిలర్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు బుద్ధవరం లక్ష్మి వేణుగోపాల్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు మహేందర్ యాదవ్, గోంగళ్ళ మహేష్, బిజ్జ శ్రీనివాస్ గౌడ్, నాగారం మున్సిపల్ అధ్యక్షులు కొండబోయిన నాగరాజు యాదవ్, దమ్మాయిగూడ మున్సిపల్ అధ్యక్షుడు తోట నరేష్ పటేల్, ఘట్కేసర్ మండల అధ్యక్షులు బసవరాజ్ గౌడ్, పోచారం మున్సిపల్ అధ్యక్షులు సురేష్ నాయక్, పిర్జాదిగూడ మున్సిపల్ అధ్యక్షులు రాంపల్లి యాదగిరి గౌడ్, మేడ్చల్ మున్సిపాలిటీ అధ్యక్షురాలు జెల్లీ శైలజ , ఫిర్జాది గూడా మాజీ అధ్యక్షులు అనిల్ , ఘట్కేసర్ మాజీ అధ్యక్షులు ప్రవీణ్ రావు ,, విజయవయం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాగం అర్జున్, మహేందర్ , వెంకట చారి , మరియు జిల్లా మున్సిపాలిటీ పదాధికారులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నల్ల బ్యాడ్జిలతో మౌన ప్రదర్శన నిర్వహించి నివాళులు అర్పించడం జరిగింది.

# పోలీసుల విద్యార్హతపై.. డీజీపీ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, ఆగష్టు 14:దేశంలోనే తొలిసారిగా తెలంగాణా పోలీస్ డిపోర్ట్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తున్న వారందరికీ గ్రాడ్యుయేషన్ ఉండాలని నిర్ణయించామని డీజీపీ జితేందర్ తెలిపారు. అందులోభాగంగా గురువారం హైదరాబాద్‌లో తెలంగాణా పోలీస్, బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీల మధ్య ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా డీజీపీ జితేందర్ మాట్లాడుతూ.. పోలీస్ డిపోర్ట్‌మెంట్‌లో 10వ తరగతి, ఇంటర్ చదివి గతంలో ఈ పోలీస్ శాఖలో చేరారని గుర్తు చేశారు.

అయితే వారికి గ్రాడ్యుయేషన్ కల్పించాలని పోలీస్ శాఖ నిర్ణయం తీసుకుందన్నారు. వాని గ్రాడ్యుయేషన్ చేయించాలనే ఉద్దేశంతో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీతో ఒప్పందం కుదుర్చుకున్నామని వివరించారు. డిపార్ట్‌మెంట్‌లో దాదాపు కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్స్.. 30 వేల మంది గ్రాడ్యుయేషన్ పూర్తి చేయని వారు ఉన్నట్లు తాము గుర్తించామని పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్లలో పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో అందరూ గ్రాడ్యుయేషన్ చేసిన వారిగా ఉండాలని తమ సంకల్పమని ఈ సందర్భంగా డీజీపీ జితేందర్ స్పష్టం చేశారు.

ఇక అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ గంటా చక్రపాణి మాట్లాడుతూ.. దేశంలోని అన్ని రాష్ట్రాల పోలీస్ శాఖలకంటే.. మనం అన్ని రకాలుగా ఉత్తమ స్థానంలో ఉన్నామన్నారు. డీజీపీ జితేంద్రకి వచ్చిన ఆలోచనే ఇప్పుడు కార్యరూపం దాల్చిందని పేర్కొన్నారు. పోలీస్ శాఖలో ప్రస్తుతం వివిధ విభాగాల్లో, పలు పోస్టుల్లో పని చేస్తున్న వారిలో కొందరికి డిగ్రీ అర్హత లేదని తెలిపారు. పలు కారణాలతో డిగ్రీ చేయకపోవడం లేదా డిగ్రీ మధ్యలోనే ఆపేసిన వాళ్లు సైతం ఉన్నారని వివరించారు.

# నేడు నగరాల్లో మద్యం షాపుల బంద్

హైదరాబాద్, ఆగష్టు 14:దేశ వ్యాప్తంగా రేపు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. హైదరాబాద్ మహానగరం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో శాంతి, భద్రతలకు విఘాతం కలుగకుండా ఉండేందుకు మద్యం అమ్మకాలు నిలిచిపోనున్నాయి. వైన్ షాపులు ఆగస్టు 15వ తేదీన మూతపడున్నాయి. బార్స్, పబ్స్, మందు సప్లై చేసే రెస్టారెంట్లు రేపు మూతపడున్నాయి. హైదరాబాద్‌తో పాటు ఢిల్లీ, ముంబై, బెంగళూరు లాంటి నగరాలు కూడా డ్రై డే పాటించనున్నాయి.

హైదరాబాద్ నగరంలో ఆగస్టు 15, 16 తేదీల్లో మాంసం దుకాణాలు బంద్ ఉండనున్నాయి. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ అధికారిక ప్రకటన చేశారు. ఆగస్టు 15, 16 తేదీల్లో మాంసం దుకాణాలు బంద్ అవ్వనున్నట్లు తెలిపారు. ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం కావటంతో మాంసం షాపులు బంద్‌లో ఉంటాయి. మరునటి రోజు.. అంటే ఆగస్టు 16వ తేదీన శ్రీకృష్ణాష్టమి కావటంతో మాంసం దుకాణాలు బంద్ చేయాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది.

# 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా ఘనంగా 'హర్ ఘర్ తిరంగా'

## - నెక్లెస్ రోడ్ పై తిరంగా యాత్రను జెండా ఊపి ప్రారంభించిన రాంచందర్ రావు



హైదరాబాద్ ఆగస్టు 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' జండా కార్యక్రం లో బాగంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్ పై తిరంగా యాత్రను బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో జంట నగరాలకు చెందిన బిజెపి నాయకులు, కార్యకర్తలు, వివిధ కళాశాలల విద్యార్థులు, యువకులు, పౌరులు జాతీయ జెండాలను చేతబూని పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గారి పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం, తిరంగా యాత్ర భారతదేశంలో ప్రతి పౌరుడి గుండెలో దేశభక్తిని నింపుతోంది. ప్రతి ఇంటి మీద జాతీయ పతాకం ఎగరేయడం ద్వారా దేశ ఐక్యత, గౌరవం, సమగ్రత, దేశభక్తిని నింపేలా గొప్ప కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఇదే నేపథ్యంలో హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో చేపట్టిన తిరంగా ర్యాలీలో యువత, విద్యార్థులు, మహిళలు అందరూ పెద్ద ఎత్తున భాగస్వామ్యమయ్యారు. నరేంద్ర మోదీ గారి నేతృత్వంలో భారతదేశం సుపరిపాలనతో ముందుకు సాగుతోంది. భారతదేశం ప్రపంచంలో నాలుగో స్థానంలో ఆర్థిక శక్తిగా ఎదిగింది. రాబోయే రోజుల్లో సూపర్ పవర్‌గా అవతరిస్తుంది. దేశం అభివృద్ధి చెందాలంటే దేశభక్తి, జాతీయవాదం (నేషనలిజం) అవసరం. ఆ నేషనలిజం స్ఫూర్తిగా దేశ వ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం చేపట్టడం జరిగింది. తెలంగాణలో 40 లక్షల ఇండ్లపై త్రివర్ణ పతాకం ఎగురవేసి దేశభక్తిని చాటడం జరుగుతోంది. రాబోయే తరాలకు ఈ స్ఫూర్తిని అందించాలి. నరేంద్ర మోదీ గారి పిలుపు మేరకు హైదరాబాద్‌తో పాటు దేశ వ్యాప్తంగా ప్రతి వీధిలో, ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురుతోంది. తిరంగా యాత్ర జరుగుతోంది. భారతదేశానికి స్వాతంత్ర్యం రావడానికి వేలాది మంది పోరాటయోధులు, మహనీయుల త్యాగాలే కారణం. వారి త్యాగాలు భవిష్యత్ తరాలకు మార్గదర్శకం. మన దేశాన్ని విడగొట్టి మన దేశ సంపద దోచుకున్న పాకిస్థాన్ కు, ఆ రోజున మతం ఆధారంగా దేశాన్ని విడగొట్టిన బ్రిటిషర్లకు కాంగ్రెస్ పార్టీ సపోర్ట్ చేసింది. మరోసారి దేశ విభజనకు ప్రసక్తే ఉండకూడదు. ఆ సంకల్పంతో భారతదేశ ఐక్యతను, సమగ్రతను, సంస్కృతిని కాపాడేలా తిరంగా యాత్ర ద్వారా సంకల్పం తీసుకోవడం జరిగింది.

# మంత్రి శ్రీధర్ బాబు కు పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అభినందనలు..



హైదరాబాద్ ఆగస్టు 14 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);పీపుల్ ఇన్ ఏ ఐ జాబితాలో పరిశ్రమలు, ఐ.టి శాఖ మంత్రి శ్రీధర్ బాబు కు చోటు లభించడం పట్ల మహేష్ కుమార్ గౌడ్ అభినందనలు తెలిపారు.

ఏ.ఐ విభాగంలో దేశంలో అత్యంత ప్రభావిత వ్యక్తులతో 100 మందిలో తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు చోటు లభించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో అన్ని రంగాలలో అత్యంత ప్రతిభ కనబరుస్తూ ప్రజాపాలన సాగిస్తుందని అన్నారు.

ప్రపంచ వ్యాప్తంగా ఏ.ఐ రంగం దూసుకుపోతున్న క్రమంలో తెలంగాణలో ఏ.ఐ ఆధారిత కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ అనేక చర్యలు చేపడుతున్న మంత్రి శ్రీధర్ బాబు కు పీపుల్ ఇన్ ఏ.ఐ 2025 జాబితాలో చోటు లభించడం హర్షణీయం అన్నారు.

# స్వతంత్ర భారతం - సవాళ్లు, సాఫల్యతలు!

## 15 ఆగస్టు "79వ భారత స్వాతంత్ర్య దినోత్సవం" సందర్భంగా)

వేద భూమి భారతం. ప్రపంచ మానవాళికి నాగరిక నేర్పిన దేశం భారతం. భిన్నత్వంలో ఏకత్వం సువిశాల భారతం. పురాణ ఇతిహాసాల పునాదులుగా నిర్మితమైంది భారతీయ జీవన తత్వం. అతి పెద్ద ప్రజాస్వామ్యానికి చిరునామా భారతం. 142 కోట్ల అత్యధిక జనాభా నా దేశ స్వంతం. శాంతి, సహనం,సౌభ్రాతృత్వం, సామరస్యాలకు నెలవు భారతం. సవాళ్లు ఎన్ని ఉన్నా స్థిరంగా నిలబడింది నా భరతమాత. ఆర్థిక ప్రగతి రథం పరుగులు పెడుతున్న వేళ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టను పెంచుకుంటున్నది నా మాతృభూమి. సుస్థిరాభివృద్ధే లక్ష్యంగా ముందడు వేస్తున్న భారతాన్ని పేదరికం, నిరుద్యోగం, అధిక జనాభా, అసమానతలు, అవిద్య, అనారోగ్యం లాంటి పలు సమస్యలు పట్టి పీడిస్తున్నాయి.

గత 78 ఏండ్లుగా సుస్థిర అభివృద్ధిని సాధించినా నేటికీ ఆకలి చావులు, వైద్య ఆరోగ్య సమస్యలు, నిరక్షరాస్యత దేశానికి శాపంగా కొనసాగుతూనే ఉన్నాయి. అత్యధిక యువశక్తి కలిగిన భారతదేశం రేపటి ప్రపంచానికి దారి దీపంగా నిలవడానికి అవిరళ కృషి చేస్తున్నది.

### అంతర్జాతీయ దారిద్ర్య రేఖ:

ప్రపంచ పేదరిక అధ్యయనాల ప్రకారం, ప్రతి నిమిషానికి 44 మంది భారతీయులు పేదరిక కోరల్లోంచి బయట పడుతున్నట్లు తేలింది. గత రెండు దశాబ్దాలుగా దేశం రుచి చూస్తున్న సాంకేతిక విప్లవం, ఆర్థికాభివృద్ధి వల్ల పేదరికం 56 శాతం నుంచి 28 శాతానికి దిగువన చేరడం హర్షణీయం. దారిద్ర్య రేఖకు దిగువన 5.3 శాతం జనాభా ఉండగా పేదరికం మాత్రం 21.9 శాతం కన్న తక్కువగా నమోదు అవుతున్నది. ఒక వ్యక్తి గౌరవంగా జీవించడానికి అవసరమైన కూడు, గూడు, గుడ్డ లేని ప్రజలను పేదలుగా పిలుస్తున్నాం. ప్రపంచ బ్యాంక్ వివరణ ప్రకారం, కనీస ఆర్థిక వనరులు, విద్య, గౌరవం, ఆరోగ్య భద్రత, సురక్షిత తాగునీరు, పరిసరాలు పరిశుభ్రత, ఉద్యోగ ఉపాధులు లాంటివి లేని వారిని పేదలుగా గుర్తించడం జరుగుతోంది. ఒక వ్యక్తి రోజుకు 3.00 అమెరికన్ డాలర్ల కన్న తక్కువ ఖర్చు చేసినపుడు వారిని అంతర్జాతీయ దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నట్లు వర్గీకరించారు.

### పేదరికం ఓ బహువ్యాధి లక్షణం :

పేదరికం పెరిగితే అవిద్య, అశుభ్రత, అనారోగ్యం, ఆర్థిక అసమానతలు, పోషకాహార లోపం, ఆకలి చావులు, గృహవసతిలో కొరత, నిరుద్యోగం, బాలకార్మిక వ్యవస్థ లాంటి అవస్థలు పెరుగుతాయి. అనగా పేదరికం అనేది సమాజాన్ని పట్టి పీడించే బహువ్యాధి లక్షణంగా అర్థం చేసుకోవాలి. నీతి ఆయోగ్ వివరణ ప్రకారం, పట్టణ ప్రాంతాల్లో తలసరి నెలసరి కనీస వ్యయం రూ 1,407/-, గ్రామీణంలో తలసరి నెలసరి వ్యయం రూ 972/- కన్న తక్కువగా ఉన్నట్లైతే వారిని పేదలుగా వర్గీకరించడం జరుగుతుంది. టెన్‌దూల్కర్ కమిటీ అధ్యయనం ప్రకారం, ప్రతి పౌరుడు దినసరి రూ62/- కన్న తక్కువ ఖర్చు చేస్తే పేదలుగా గుర్తించాలి. పేదరికానికి ప్రధాన కారణాలుగా అధిక జనాభా, వ్యవసాయ ఉత్పత్తి తగ్గడం, వనరుల వినియోగంలో లోపం, ధరలు పెరగడం, నిరుద్యోగం, యువతలో నైపుణ్యాల కొరత, శ్రమ దోపిడీ, కాలం చెల్లిన సంప్రదాయాలు, పారిశ్రామిక ప్రగతి మందగించడం, అవినీతి, లింగ అసమానతలు, సామాజిక అవాంతరాలు, నిరక్షరాస్యత, కులమత విభేదాలు, రాక్షస రాజకీయాలు, ఓటు బ్యాంకు పాలనలు లాంటి పలు అంశాలు దోహదపడుతున్నాయి.

### భరతమాత ఎదుట సమాళ్లు - సమాధానాలు:

గరీబీ హటావో నినాదం కొనసాగుతూనే ఉన్నది. అవినీతి అక్రమాలు కోరలు చాస్తున్నాయి. రాజకీయాలు భ్రష్టు పట్టి పోయాయి. మానవ సంబంధాలు ధనం జపం చేసేతున్నాయి. న్యాయ దేవత కళ్లకు గంతలు కట్టబడి ఉన్నాయి. నీతి, న్యాయం అను మాటలు అసమర్థుల నినాదాలుగా పరిగణించబడుతూ ఎగతాళికి గురి అవుతున్నాయి. ప్రజాధనం అవినీతిపరుల జేబుల్లోకి ఏరులై పారుతోంది. పథకాలు ఎన్ని అమలు చేసినా ఫలితాలు పాతాళానికి పడిపోతున్నాయి.

మనిషి మానవత్వాన్ని మరిచి రాక్షసత్వాన్ని నెత్తిన ఎత్తుకుంటున్నాడు. పేదరికానికి విరుగుడుగా రేపటి భవ్య భారత నిర్మాణానికి ఉచిత విద్య, అర్హతకు తగిన పని కల్పన, వైద్య ఆరోగ్య పసతుల కల్పన, గృహ వసతి, పరిసరాల పరిశుభ్రత, మౌలిక వనరుల కల్పన, పోషకాహార వినియోగం, లాభసాటి వ్యవసాయం, యువతకు నైపుణ్యాలతో కూడిన నాణ్యమైన విద్య, స్థానిక సంస్థల బలోపేతం, ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత, ఉద్యోగుల జవాబుదారీతనం, అవినీతి లంచగొండితనాలకు తరిమి వేయడం లాంటి బహుముఖీన చర్యలను అమలు చేయడం జరిగితే భారత సరిహద్దులు దాటి పేదరికం తరుమబడుతుంది.

అధిక యువ జనాభా భరతమాతకు మాత్రమే ప్రత్యేకం. మన యువత బాధ్యతగల నైపుణ్యతతో కూడి విద్యావంతులుగా ఎదిగి భరతమాత సేవలో పుణీతులు కావాలి, మనం ఎదుగుతూ, దేశం పురోగమించే విధంగా ప్రగతి రథ చక్రాలకు ఇంధనాలుగా మారాలి. 2047 నాటికి వికసిత భారత్‌గా ప్రపంచ దేశాల ముందు సగర్వంగా నిలబడాలి.

-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ఢిల్లీలో ఎర్రకోట నుంచి 79వ స్వాతంత్ర్య వేడుకలకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వం

న్యూఢిల్లీ, ఆగష్టు 14:భారత్ 2025 ఆగస్టు 15న తన 79వ స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహించుకోనుంది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఢిల్లీలోని ఐతిహాసిక ఎర్రకోట నుంచి ఈ మహోత్సవానికి నాయకత్వం వహిస్తారు. ఇందులో భాగంగా కోటపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. వికసిత భారత్-2047 స్వప్న సాకారంపై ప్రభుత్వ దృక్కోణానికి అనుగుణంగా దేశం వేగంగా ముందంజ వేస్తున్న నేపథ్యంలో 'నవ భారత్' ఇతివృత్తంగా ఈ ఏడాది వేడుకలను నిర్వహిస్తారు. సుసంపన్న, సురక్షిత, సాహసోపేత నవ భారత్ నిరంతర వృద్ధిని గుర్తుచేసుకుంటూ పురోగమన పథంలో దేశం మరింత వేగం పుంజుకోగలిగేలా శక్తిని సంతరించుకునే దిశగా ఈ వేడుకలు ఒక వేదిక కాగలవు.

ప్రధానమంత్రి ఎర్రకోట వద్దకు చేరుకోగానే రక్షణశాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్, సహాయ మంత్రి శ్రీ సంజయ్ సేథ్, కార్యదర్శి శ్రీ రాజేష్ కుమార్ సింగ్ స్వాగతిస్తారు. అటుపైన జనరల్ ఆఫీసర్ కమాండింగ్ (జీవోసీ), ఢిల్లీ ఏరియా లెఫ్టినెంట్ జనరల్ భవనీష్ కుమార్‌ను రక్షణ కార్యదర్శి ప్రధానమంత్రికి పరిచయం చేస్తారు. అనంతరం ఆయన శ్రీ నరేంద్ర మోదీని గౌరవ వందన స్వీకార వేదిక వద్దకు తీసుకెళ్తారు. ఆ తర్వాత ఇంటర్-సర్వీసెస్ సంయుక్త దళం, ఢిల్లీ పోలీస్ గార్డులు ప్రధానమంత్రికి వందనం చేస్తారు. ఈ లాంఛనం ముగిశాక ప్రధానమంత్రి గౌరవ వందనం (గార్డ్ ఆఫ్ ఆనర్) స్వీకరిస్తారు.

ఈ బృందంలో 96 మంది (సైనిక, నావిక, వైమానిక దళాలు సహా ఢిల్లీ పోలీసు విభాగం నుంచి ఒక్కొక్క అధికారి సహా మొత్తం 24 మంది) సిబ్బంది సభ్యులుగా ఉంటారు. ఈ సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవానికి వైమానిక దళం సమన్వయ సేవ బాధ్యతలు నిర్వర్తిస్తోంది. గార్డ్ ఆఫ్ ఆనర్ కు వింగ్ కమాండర్ ఎ.ఎస్.సెఖోన్ నాయకత్వం వహిస్తారు. ఈ బృందంలోని సైనిక సిబ్బందికి మేజర్ అర్జున్ సింగ్, నావికా సిబ్బందికి లెఫ్టినెంట్ కమాండర్ కోమల్ దీప్ సింగ్, వైమానిక దళ సిబ్బందికి స్క్వాడ్రన్ లీడర్ రాజన్ అరోరా, ఢిల్లీ పోలీసు సిబ్బందికి అదనపు డీసీపీ శ్రీ రోహిత్ రాజ్‌బీర్ సింగ్ నాయకత్వం వహిస్తారు.

అనంతరం ప్రధానమంత్రి ఎర్ర కోట బురుజుల పైకి చేరుకుంటారు. అక్కడ ఆయనకు రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్, సహాయ శ్రీ సంజయ్ సేథ్, రక్షణ సిబ్బంది అధిపతి (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్, సైనిక సిబ్బంది అధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది, నావికా సిబ్బంది అధిపతి చీఫ్ అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠీ, వైమానిక సిబ్బంది అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్ స్వాగతం పలుకుతారు. ఆ తర్వాత జాతీయ పతాకావిష్కరణ కోసం ప్రధానమంత్రిని ఢిల్లీ ఏరియా 'జీవోసీ' జెండా వేదిక వద్దకు తీసుకెళ్తారు.

ఫ్లయింగ్ ఆఫీసర్ రషికా శర్మ జాతీయ పతాకాన్ని ఎగురవేయడంలో ప్రధానమంత్రికి సహకరిస్తారు. అదే సమయంలో పరాక్రమవంతులైన 1721 ఫీల్డ్ బ్యాటరీ (సెరిమోనియల్) గన్నర్లు 21 తుపాకులు పేల్చడం ద్వారా గన్ సెల్యూట్ చేస్తారు. స్వదేశీ తయారీ 105ఎం.ఎం. లైట్ ఫీల్డ్ గన్‌లను ఉపయోగించే ఈ ఉత్సవ సైనిక బృందానికి మేజర్ పవన్ సింగ్ షెఖావత్ మార్గదర్శ్యత్వం వహిస్తారు. నాయబ్ సుబేదార్ (గన్నరీలో అసిస్టెంట్ ఇన్‌స్ట్రక్టర్) అనుతోష్ సర్కార్ గన్ పొజిషన్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు.

ప్రధానమంత్రి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించే సమయంలో జాతీయ జెండా గార్డ్ బృందంలోని 128 మంది (సైనిక, నావిక, వైమానిక దళాలు సహా ఢిల్లీ పోలీసు విభాగం నుంచి ఒక్కొక్క అధికారి సహా 32 మంది) సిబ్బంది త్రివర్ణ పతాకానికి వందనం సమర్పిస్తారు. ఈ ఇంటర్-సర్వీసెస్, పోలీస్ సంయుక్త గౌరవ వందనానికి వింగ్ కమాండర్ తరుణ్ డాగర్ నాయకత్వం వహిస్తారు.

జాతీయ పతాక గౌరవ వందన బృందంలోని సైనిక సిబ్బందికి మేజర్ ప్రకాష్ సింగ్, నావికా సిబ్బందికి లెఫ్టినెంట్ కమాండర్ మొహద్ పర్వేజ్, వైమానిక సిబ్బందికి స్క్వాడ్రన్ లీడర్ వి.వి.శర్వణ్, ఢిల్లీ పోలీసు సిబ్బందికి అదనపు డీసీపీ శ్రీ అభిమన్యు పోస్వాల్ నాయకత్వం వహిస్తారు.

త్రివర్ణ పతాక ఆవిష్కరణానంతరం జెండాకు జాతీయ గౌరవ వందనం సమర్పిస్తారు. ఈ సందర్భంగా ఒక జేసీవో, 25 మంది ఇతర ర్యాంకుల సిబ్బంది సహిత వైమానిక దళ బ్యాండ్ వాద్య పరికరాలపై జాతీయ గీతాన్ని వాయిస్తుంది. జూనియర్ వారెంట్ ఆఫీసర్ ఎం.డేకా ఈ బ్యాండ్‌కు మార్గదర్శకత్వం వహిస్తారు. ఈ ఏడాది వేడుకలలో తొలిసారిగా 11 మంది వైమానిక దళ అగ్నివీర్ వాద్యకారులు కూడా ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు.

ప్రధానమంత్రి జాతీయ జెండాను ఎగురవేయగానే వైమానిక దళంలోని రెండు ఎంఐ-17 హెలికాప్టర్లు వేదికపై పుష్పవర్షం కురిపిస్తాయి. వీటిలో ఒకటి జాతీయ పతాకాన్ని, మరొకటి 'ఆపరేషన్ సిందూర్'ను స్ఫురింపజేసే జెండాను ప్రదర్శిస్తాయి. ఈ హెలికాప్టర్లకు వింగ్ కమాండర్లు వినయ్ పూనియా, ఆదిత్య జైస్వాల్ కెప్టెన్లుగా ఉంటారు.

ఈసారి స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా ఆపరేషన్ సిందూర్ విజయోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా జ్ఞానపథ్‌లోని వ్యూ కట్టర్ (బారికేడ్)పై ఆపరేషన్ సిందూర్ ను గుర్తుచేసే పుష్పాలంకరణతో లోగోను ప్రదర్శిస్తారు.

వేడుకల ఆహ్వాన పత్రాలపైనా ఆపరేషన్ సిందూర్ లోగోను ముద్రించారు. దాంతోపాటు 'నవ భారత్'ను సూచిస్తూ చీనాబ్ వంతెన వాటర్ మార్క్ కూడా కనిపిస్తుంది.

జాతీయ పతాకావిష్కరణ సమయంలో పుష్పవర్షం అనంతరం ప్రధానమంత్రి ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. ఆయన ప్రసంగం ముగిశాక (సైనిక, నావిక, వైమానిక దళాల) స్త్రీ-పురుష నేషనల్ కేడెట్ కోర్ (ఎన్‌సీసీ) కేడెట్లు, 'మై భారత్' వలంటీర్లు జాతీయ గీతం ఆలపిస్తారు. ఈ రెండు విభాగాల నుంచి 2,500 మంది స్వాతంత్ర్య వేడుకలలో పాల్గొంటున్నారు. వీరంతా జ్ఞానపథ్‌లో ప్రాకారానికి ఎదురుగా 'నవ భారత్' లోగో ఆకారంలో కూర్చుని ఆ స్వరూపాన్ని కళ్లకు కట్టేలా చేస్తారు.

పౌరులలో దేశభక్తిని పెంపొందించడంతోపాటు స్వాతంత్ర్య వేడుకల రోజు సాయంత్రం ఆపరేషన్ సిందూర్ విజయోత్సవంలో భాగంగా తొలిసారి దేశవ్యాప్తంగా అనేక బ్యాండ్ ప్రదర్శనలు ఉంటాయి. ఈ మేరకు 140కి పైగా కీలకమైన ప్రదేశాల్లో సైనిక, నావిక, వైమానిక, తీర రక్షక, ఎన్‌సీసీ, సీఆర్పీఎఫ్, ఐటీబీపీ, సీఐఎస్ఎఫ్, ఎస్ఎస్‌బీ, బీఎస్ఎఫ్, ఐడీఎస్, ఆర్‌పీఎఫ్, అస్సాం రైఫిల్స్ సిబ్బంది ఈ ప్రదర్శనలిస్తారు.

# పాలకుర్తి మండలంలో రూ.38కోట్ల అభివృద్ధి పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే

కరీంనగర్, ఆగష్టు 14: పాలకుర్తి మండలం లోని పలు గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ సిమెంట్ రోడ్లు, మురికి కాలువ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. మండలంలోని బసంత్ నగర్, పాలకుర్తి, ఈసాల తక్కలపల్లి, కొత్తపల్లి,రామారావు పల్లె, పుట్నూర్,జయారం, గుడిపల్లి, కుక్కల గూడూర్, వేమునూరు, గ్రామాల్లో డిఎంఎఫ్టి, ఎన్జీఆర్ఎస్ నుంచి 38 కోట్ల 90 లక్షల నిధులతో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం పనులను ప్రారంభించారు. బసంత్ నగర్ లో వారసంత మార్చాలని, పాలకుర్తి, ఈసాల తక్కలపల్లి గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, చెక్కులను రేషన్ కార్డులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఇబ్బందులు ఉంటే సమాచారం ఇవ్వాలని లబ్ధిదారులను ఆదేశించారు. ఈసాలతక్కలపల్లి లోని జేమ్స్ మోడల్ పాఠశాలలో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొని ఎమ్మెల్యే పాల్గొని గోపిక శ్రీకృష్ణుల వేషధారణలో ఉన్న చిన్నారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్స్ ఛైర్మన్ బయ్యపు మనోహర్ రెడ్డి, ఏఎంసి చైర్మన్ గడ్డం తిరుపతి, మక్కాన్సింగ్ సేవా సమితి అధ్యక్షురాలు మనాలి ఠాగూర్, కాంగ్రెస్ నాయకులు మక్కెర శ్రీనివాస్ గౌడ్, గంగాధరి రమేష్ గౌడ్, సురా సమ్మయ్య, పరిషవేణి శ్రీనివాస్, పాత రవీందర్, తువ్వా సతీశ్ యాదవ్, భోదాసు శంకర్, నారా సత్తయ్య, మాదాసు శ్రావణ్, మల్లెత్తుల శ్రీనివాస్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణ ఆలయంలో జన్మాష్టమి వేడుకలు ప్రారంభం



ఆదిలాబాద్, ఆగష్టు 13:నిర్మల్ జిల్లా కుభీర్ మండలకేంద్రం కానోబా గల్లీలో ప్రసిద్ధిగాంచిన పురాతన శ్రీకృష్ణ ఆలయంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో పూజారులు అభిషేకం, పుష్పార్చన నిర్వహించారు. అనంతరం ఆలయంలో వార్కరి సంప్రదాయు బద్ధులైన విట్టల్ మహారాజ్ కీర్తన, భజన కార్యక్రమాలను కొనసాగించారు.

మూడు రోజుల పాటు ఘనంగా జరిగే ఈ వేడుకలకు కుభీర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు శ్రీకృష్ణ పరమాత్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. అష్టమి రోజైన శనివారం ఉదయం స్వామివారికి అభిషేకం, పట్టు వస్త్రాల సమర్పణ, ఊయల కార్యక్రమంతో పాటు భక్తులకు అన్న ప్రసాద వితరణ జరగనుందని నిర్వహకులు తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షులు తిప్పబోజన్న, సభ్యులు పుప్పాల పిరాజి, భజన మండలి సభ్యులు గిరి పోశెట్టి, ఆలయ కమిటీ సభ్యులు వేడుకలకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి : అడిషనల్ డీఎంహెచ్ వో



ఆదిలాబాద్, ఆగష్టు 14: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ డీఎంహెచ్ వో కుడ్మేత మనోహర్ వైద్య సిబ్బందికి సూచించారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలిస్తూ, ఆసుపత్రికి వచ్చే రోగులకు అందే వైద్య తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న తరుణంలో అపరిశుభ్రత లోపించకుండా , డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. హై రిస్క్ గర్భిణిలో ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పరిశుభ్రత తోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని విషయాన్ని పల్లెలలో స్థానికులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి జితేందర్ రెడ్డి, హెచ్ఈవో తులసీదాస్, వైద్య సిబ్బంది నాందేవ్, చరణ్ దాస్, సత్యావ్వ , గణేష్ కుమారి, విలాస్, కైలాస్ తదితరులున్నారు.

# ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలి : కాదూరి అచ్చయ్య




ఆలేరు టౌన్, ఆగష్టు 14 : స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగుర వేయాలని బీజేపీ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి కాదూరి అచ్చయ్య, ఆలేరు మండలాధ్యక్షుడు పూజారి కుమారస్వామి గౌడ్ ప్రజలకు పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా యాత్రలో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో ఆలేరులోని రైల్వే గేట్ నుండి బస్టాండ్ వరకు జాతీయ జెండాలతో గురువారం ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు మాత్రమే జాతీయ జెండాను ఆవిష్కరించే వారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగాతో ప్రతి ఒక్కరూ జెండాను తమ ఇంటిపై ఎగురవేయాలని కోరారు.

స్వాతంత్ర సమర యోధులను స్మరించుకుని వారి విగ్రహాలను శుద్ధి చేయాలన్నారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పండుగలాగా జరుపుకోవాలన్నారు.

విభిన్న మతాలు, కులాలు ఉన్న దేశంలో భిన్నత్వంలో ఏకత్వం ఉన్న దేశం భారతదేశమే అన్నారు. అంతకుముందు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో హర్ ఘర్ తిరంగా జిల్లా కో కన్వీనర్ కామిటికారి కృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి దశరథ, జిల్లా కౌన్సిల్ మెంబర్ బర్ వడ్డెమన్ నరేందర్, భోగ శ్రీనివాస్, పట్టణ మండల ప్రధాన కార్యదర్శులు ఏలగల వెంకటేశ్, శేషత్వ అమరేందర్, నాయకులు సుభాష్, బైరి మహేందర్ గౌడ్, వడ్డేపల్లి కిషన్, పంపరి లక్ష్మీనారాయణ, కళ్లెపు యాదగిరి, ఐలి సందీప్, ద్వారపు రమణ, పూల హనుమంతు, గాజుల సారయ్య, కృష్ణమూర్తి, సుక్కరాజు, గడ్డం సందీప్, కొళ్ల సందీప్, గిరిపోయిన పరశు రాములు, శ్రావణ్ కుమార్, రవితేజ, భరత్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజలకు చట్టాలపై అవగాహనకు నేతాజీ యువజన సంఘం కృషి : ఎస్.జె.అహ్మద్

ఖమ్మం, ఆగష్టు 14: సమాజానికి సేవ చేయడమే కాకుండా, ప్రజల్లో చైతన్యం తీసుకురావడం, అలాగే ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు నేతాజీ యువజన సంఘం కృషి చేస్తోందని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్‌జే. కె. అహ్మద్ తెలిపారు. నేతాజీ యువజన సంఘం 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం పాల్వంచ పట్టణ పరిధి వనమా కాలనీలోని ఆ సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవీలాల్ నాయక్, యూత్ కాంగ్రెస్ పాల్వంచ పట్టణ ఉపాధ్యక్షుడు భార్గవ్ సాయి, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సయ్యద్ రషీద్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎం.డి.మంజూరు, తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి వేముల కొండలరావు అహ్మద్ చేస్తున్న సేవలను కొనియాడుతూ ఆయనను ఘనంగా సన్మానించారు. సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.

అహ్మద్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు అండగా ఎన్నో సామాజిక కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం యువకులకు క్రీడా స్ఫూర్తి, దేశభక్తి పెంపొందిస్తున్నట్లు చెప్పారు.

# 18 న రాజ్‌భవన్‌లో వికలంగులకు ఉచిత శస్త్రచికిత్స మరియు ఆరోగ్య శిబిరం

హైదరాబాద్ ఆగష్టు 14 (ఎక్స్‌ప్రెస్ న్యూస్);గవర్నర్ శ్రీ గిష్ణు దేవ్ వర్మ మరియు వికలాంగులు మరియు సామాజిక సాధికారత మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మార్గదర్శకత్వంలో రాజ్‌భవన్, డిసేబుల్ ఫౌండేషన్ ట్రస్ట్ మరియు రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ బ్రాంచ్ మరియు అగర్వాల్ సేవాదళ్ బద్రివిషెల్ పన్నాలాల్ పిట్టి ట్రస్ట్, మహావీర్ వికలంగ్ సహాయత సమితి, రామ్‌దేవ్ రావు హాస్పిటల్ ట్రస్ట్. 18.8.25న ఉదయం 8 గంటల నుండి సోమాజిగూడలోని సాంస్కృతిక భవన్ రాజ్‌భవన్‌లో ఉచిత శస్త్రచికిత్స మరియు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రొఫెసర్ డాక్టర్ విజయభాస్కర్ ఆర్ చైర్మన్, ఎం బీమ్ రెడ్డి లు తెలిపారు చైర్మన్ ఐఆర్‌సిఎస్ హైదరాబాద్. డాక్టర్ కీర్తన నారి ఫౌండేషన్. డాక్టర్ కమలకర్ కె. శరద్ పిట్టి. జన జాగృతి. తెలంగాణ అంతటా వికలాంగులను డిసేబుల్ కార్పొరేషన్ తెలంగాణ ప్రభుత్వం సమీకరిస్తుంది.

కృత్రిమ అవయవాలు కాలిపర్లు మరియు వికలాంగుల వైకల్యాల ఉచిత శస్త్రచికిత్స దిద్దుబాటు మరియు సాధారణ ఆరోగ్య శిబిరం. ఉచిత ఔషధం ఉచిత ప్రయోగశాల పరీక్షలు కంటి చెకప్ అద్దాలు అందించబడతాయి.

# జమ్మూకాశ్మీర్‌లోని మార్హ్వా గ్రామంలో హర్ ఘర్ తిరంగా వేడుకలు

న్యూఢిల్లీ, ఆగష్టు 14:హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జమ్మూ కాశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంలోని మార్హ్వా గ్రామంలో ఉత్సాహభరితంగా వేడుకలు నిర్వహించారు.

కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు.. ఐక్యత, స్వాభిమానం, దేశభక్తి స్ఫూర్తిని చాటేలా సగర్వంగా త్రివర్ణ పతాకాన్ని ఎగురువేశారు. మూడేళ్ల కిందట ప్రారంభమైనప్పటి నుంచి 'హర్ ఘర్ తిరంగా' ఓ ఇంటింటి కార్యక్రమంగా మారింది. 2022లో 75వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మొదటిసారిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.




# చిగురుమామిడిలో కళాశాల విద్యార్థులకు ఐడెంటి కార్డుల పంపిణీ



కరీంనగర్, ఆగష్టు 14: చిగురుమామిడి, ఆగస్టు 14 : చిగురుమామిడి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు జిల్లా ఇంటర్ విద్యాధికారి గంగాధర్ గుర్తింపు కార్డులను గురువారం పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చదువుతోపాటు క్రమశిక్షణ, సభ్యత సంస్కారం అలవర్చుకోవాలని విద్యార్థులు సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లాలోని ముందు వరుసలో ఉండేటట్లు పట్టుదలతో లక్ష్యం చేరుకోవాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శశిధర్ శర్మ, అధ్యాపకులు సంపత్ కుమార్, రవికుమార్, కృష్ణమోహన్, అనిత, మమత, కవిత, లైబ్రేరియన్ చంద్రశేఖర్, జూనియర్ అసిస్టెంట్ వలి పాషా విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు సొంత ఖర్చుతో గుర్తింపు కార్డులను అందజేసిన ప్రిన్సిపాల్ ను అందుకు సహకరించిన అధ్యాపకుడు మహేందర్ ను జిల్లా ఇంటర్ విద్యాధికారి గంగాధర్ అభినందించారు.

# అరుణాచల్ ప్రదేశ్‌లోని షి యోమి జిల్లాలో రూ. 8146.21 కోట్ల వ్యయంతో 700 మెగావాట్ల టాటో-II జల విద్యుత్ ప్రాజెక్టు

న్యూఢిల్లీ, ఆగష్టు 14:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈ రోజు సమావేశమైన అయిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ.. అరుణాచల్ ప్రదేశ్‌లోని షి యోమి జిల్లాలో రూ. 8146.21 కోట్ల వ్యయంతో టాటో-ఎఎ జల విద్యుత్ ప్రాజెక్టు (హెచ్‌ఈపీ) నిర్మించేందుకు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసేందుకు 72 నెలల పడుతుందన్న అంచనా ఉంది.

700 ఎండబ్ల్యూ (4 లీ 175 ఎండబ్ల్యూ) స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టు 2738.06 ఎంయూ విద్యుత్‌ను ఉత్పత్తి చేయనుంది. ఈ ప్రాజెక్టు నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్ అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో విద్యుత్ సరఫరాను మెరుగుపరిచేందుకు ఉపయోగపడనుంది. అంతేకాకుండా జాతీయ గ్రిడ్ సమతుల్యతకు దోహదం చేయనుంది.

ఈశాన్య ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్ఈఈపీసీఓ), అరుణాచల్ ప్రదేశ్ ప్రభుత్వం జాయింట్ వెంచర్ ప్రాతిపదికన ఈ ప్రాజెక్టు ను చేపడతాయి. రోడ్లు, వంతెనలు, విద్యుత్ సరఫరా లైన్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ. 458.79 కోట్లు అందించనుంది. జాయింట్ వెంచంలో రాష్ట్ర ప్రభుత్వ ఈక్విటీ వాటా కింద రూ. 436.13 కోట్లు సెంట్రల్ ఫైనాన్స్ అసిస్టెన్స్ సమకూరుస్తుంది.

ప్రాజెక్టు నుంచి 12 శాతం విద్యుత్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పొందనుంది. స్థానిక ప్రాంత అభివృద్ధి నిధి (ఎల్ఏడీఎఫ్) కోసం ప్రాజెక్టు వ్యయంలో ఒక శాతాన్ని కేటాయించనున్నారు. ఈ రెండింటి ద్వారా రాష్ట్రం లబ్ధి పొందనుంది. ఈ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కూడా గణనీయంగా పెరగనున్నాయి. దీనితో పాటు సామాజిక-ఆర్థిక అభివృద్ధి కూడా జరగనుంది.

ఈ ప్రాజెక్టు ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా ఉంది. ఇది ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలతో సహా స్థానిక సరఫరాదారులు, సంస్థలు, ఎంఎస్ఎంఈలకు ప్రయోజనాన్ని అందించనుంది.

ఈ ప్రాజెక్టు కోసం దాదాపు 32.88 కిలోమీటర్ల రోడ్లు, వంతెనలను నిర్మించనున్నారు. వీటితో పాటు మౌలిక సదుపాయాలను కూడా గణనీయంగా మెరుగుపరచనున్నారు. వీటిని ప్రాజెక్టు కోసం నిర్మించినప్పటికీ ఎక్కువగా స్థానికులే ఉపయోగించుకోనున్నారు. ఆసుపత్రులు, పాఠశాలలు, మార్కెట్ స్థలాలు, ఆట స్థలాలు మొదలైన కీలక మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తుండటంతో ఈ ప్రాజెక్టు ద్వారా సంబంధింత జిల్లా కూడా అభివృద్ధి చెందనుంది. ప్రాజెక్టు నిధుల నుంచి ప్రత్యేకంగా కేటాయించిన రూ. 20 కోట్లతో వీటికి ఆర్థిక సహాయం అందించనున్నారు. పలు రకాల పరిహార కార్యక్రమాలు, ఉపాధి, సీఎస్ఆర్ కార్యకలాపాల ద్వారా స్థానిక ప్రజలు కూడా ప్రయోజనం పొందనున్నారు.

# సముద్ర రంగ భవిష్యత్ నవశకానికి నాంది పలికే 'భారత ఓడరేవుల బిల్లు-2025'కు లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ, ఆగష్టు 14:ఒక చిరస్మరణీయ తరుణంలో భాగంగా దేశ సముద్ర రంగ భవిష్యత్ నవశకానికి నాంది పలికే 'భారత ఓడరేవుల బిల్లు-2025'ను లోక్‌సభ ఈ రోజు ఆమోదించింది. దేశంలో ఓడరేవుల నిర్వహణ-నియంత్రణల విధానాలను ఈ చట్టం ఆధునికీకరిస్తుంది. వాణిజ్య సామర్థ్యాన్ని పెంచడంతోపాటు ప్రపంచ సముద్ర రంగ అగ్రగామిగా భారత్ స్థానాన్ని మరింత పటిష్ఠం చేస్తుంది. అంతకుముందు కేంద్ర ఓడరేవులు-నౌకారవాణా-జలమార్గాల శాఖ మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ ఈ బిల్లును ప్రవేశపెడుతూ- 'వలస పాలన నాటి నియంత్రణలు-నిబంధనలను తుడిచిపెట్టిన ఈ బిల్లు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆకాంక్షిత స్వావలంబన, అంతర్జాతీయ స్థాయి సముద్ర రంగ దార్శనికతను ప్రతిబింబిస్తుంది' అని వ్యాఖ్యానించారు.

ఈ బిల్లు సరకుల రవాణాను వేగిరం చేయడంతోపాటు అనుసంధానం పెంపు ద్వారా రవాణా సంబంధిత వ్యయాన్ని తగ్గిస్తుంది. రేవుల కార్యకలాపాలు, రవాణా సదుపాయాలు, గిడ్డంగులు సహా అనుబంధ పరిశ్రమలలో గణనీయ ఉపాధి అవకాశాలను సృష్టించగలదని అంచనా. దీంతోపాటు కఠిన కాలుష్య నిరోధక చర్యలు, పర్యావరణ హిత రేవు విధానాలను ఈ బిల్లు విశదీకరించడమే కాకుండా పరిశుభ్ర వాతావరణానికి దోహద పడుతుంది. ఈ బిల్లు చట్టరూపం దాల్చిన నేపథ్యంలో క్రమబద్ధీకరించిన విధానాలతో అడ్డంకులు తొలగిపోవడం సహా మెరుగైన మౌలిక సదుపాయాలతో కార్యకలాపాలు సజావుగా సాగుతూ ఎగుమతిదారులు, 'ఎంఎస్ఎంఈ'లు ఎంతో ప్రయోజనం పొందే వీలుంటుంది.

"భారత ఓడరేవులు అంతర్జాతీయ పోటీతత్వంతో కార్యకలాపాలు నిర్వహించే దిశగా నిర్ణయాత్మక ముందడుగుకు ఈ బిల్లు ఒక సూచిక. అంతేకాకుండా పర్యావరణ పరిరక్షణ, తీరప్రాంత ప్రజానీకానికి సాధికారత కల్పిస్తుంది. ఒక్కమాటలో చెబితే 'ఓడరేవులతో సౌభాగ్యం'పై గౌరవనీయ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దృక్కోణాన్ని ఇది ప్రతిబింబిస్తోంది. తదనుగుణంగా మన సముద్ర రంగాన్ని భవిష్యత్ సంసిద్ధం చేస్తుంది" అని శ్రీ సర్బానంద సోనోవాల్ వ్యాఖ్యానించారు.

ఈ బిల్లు ఓడరేవులకు జవాబుదారీతనంతో కూడిన అధిక స్వయంప్రతిపత్తినిస్తుంది. పారదర్శక చట్రంలో స్పర్థాత్మక సుంకాలను నిర్ణయించే వీలు కల్పిస్తుంది. రేవుల దీర్ఘకాలిక అభివృద్ధి దిశగా సమగ్ర ప్రణాళికను సమకూరుస్తుంది. సరకు రవాణాలో వృద్ధికి భరోసా ఇవ్వడంతోపాటు మెరుగైన అంతర్గత జలమార్గ అనుసంధానం కల్పిస్తుంది. మరోవైపు తీరప్రాంత నౌకా రవాణాను ప్రోత్సహిస్తుందని, అంతర్గత జలమార్గాలు, బహుళ రవాణా వ్యవస్థలతో నిరంతర సంధానంలో ఉంటుందని భావిస్తున్నారు. ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యాలు (పీపీపీ), రేవు ప్రాజెక్టులలో విదేశీ పెట్టుబడులకు స్పష్టమైన నిబంధనలను రూపొందించడం ద్వారా నిధుల సమీకరణను సరళం చేస్తుంది.

నిర్దేశిత లక్ష్యాల సాధనకు మద్దతుగా బలమైన సంస్థాగత చట్రాన్ని ఈ బిల్లు ఏర్పాటు చేస్తుంది. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులతో 'మారిటైమ్ స్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్' (ఎంఎస్‌డీసీ) ఏర్పాటు సహా జాతీయ రేవుల అభివృద్ధి వ్యూహాలను సమన్వయం చేస్తుంది. చిన్న రేవుల సమర్థ నిర్వహణ దిశగా 'రాష్ట్ర మారిటైమ్ బోర్డుల అధికారాలను మరింత బలోపేతం చేస్తుంది. దీనికితోడు రేవులు, వినియోగదారులు, సేవా ప్రదాతల మధ్య వివాదాలను తీర్చడాన్ని పరిష్కార కమిటీలు వేగవంతం చేస్తాయి.

ఈ సందర్భంగా శ్రీ సర్బానంద సోనోవాల్ మాట్లాడుతూ- 'మారిటైమ్ స్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎంఎస్‌డీసీ) మన ఓడరేవుల సమగ్రాభివృద్ధికిగల అడ్డంకులను తొలగిస్తుంది. రేవులన్నీ సజావుగా ముందంజ వేయడం లక్ష్యం కాబట్టి, సహకారాత్మక సమాఖ్య తత్వాన్ని ప్రోత్సహించడం కూడా ఈ బిల్లు లక్ష్యం. ఇది రాష్ట్రాల స్థాయిలోనూ సముద్ర రంగ బోర్డు ఏర్పాటుకు తోడ్పడుతుంది. చిన్న రేవుల సమర్థ నిర్వహణకు దోహదం చేస్తుంది. ఓడరేవుల అభివృద్ధి లక్ష్యంగా సమగ్ర చట్రం రూపకల్పనకు వీలు కల్పిస్తుంది.

ప్రధానమంత్రి శ్రీ మోదీ చురుకైన నాయకత్వాన వికసిత భారత్ సముద్ర నైపుణ్యాభివృద్ధి దిశగా మన వ్యవస్థను శక్తిమంతం చేయగల వాతావరణాన్ని మేం సృష్టిస్తున్నాం. తద్వారా భారత్ 2047 నాటికి సముద్ర రంగ దేశాల్లో అగ్రగామిగా అవతరిస్తుంది" అని వ్యాఖ్యానించారు.

స్థిరత్వం, భద్రత పరంగా అన్ని రేవులలో వ్యర్థాల స్వీకరణ-నిర్వహణ సదుపాయాల కల్పనను ఈ బిల్లు తప్పనిసరి చేస్తుంది. ఇది 'మార్పోల్, బల్లాస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై అంతర్జాతీయ సదస్సుల తీర్మానాలకు అనుగుణంగా కఠిన కాలుష్య నివారణ చర్యలను కూడా అమలు చేస్తుంది. ప్రతి ఓడరేవు వద్ద విపత్తులు, భద్రత ముప్పుల నివారణ కోసం అత్యవసర సంసిద్ధత ప్రణాళికలు అవసరం. అంతేగాక పునరుత్పాదక ఇంధనం, తీర విద్యుత్ వ్యవస్థల కార్యక్రమం ద్వారా ఉద్గారాల తగ్గింపు, పర్యావరణ స్థిరత్వం పెంపు వగైరాలకు తోడ్పడుతుంది.

"ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వాన భారత సముద్ర రంగం దేశ ఆర్థిక రూపాంతరీకరణకు కీలక చోదకశక్తిగా రూపొందింది. రేవుల ఆధారిత అభివృద్ధి, ప్రపంచ పోటీతత్వం, పర్యావరణ నిర్వహణపై సాగరమాల కార్యక్రమం, మారిటైమ్ ఇండియా విజన్-2030 వంటి ప్రభుత్వ కార్యక్రమాలు దృష్టి సారించాయి. వీటన్నిటినీ ప్రాతిపదికగా తీసుకుంటూ భారత ఓడరేవుల బిల్లు-2025 రూపొందింది. భారత ఓడరేవులు సుస్థిర ఆర్థిక వృద్ధికి, ప్రపంచ వాణిజ్యానికి చోదకాలుగా పరిణామం చెందగలవని ఇది భరోసా ఇస్తోంది" అని శ్రీ సర్బానంద సోనోవాల్ అన్నారు.

అంతర్జాతీయ వాణిజ్య విధానాలు, ఉత్తమాచరణలు, జాతీయ ప్రాథమ్యాలకు అనుగుణంగా భారత చట్టబద్ధ చట్రాన్ని రూపొందించే వినూత్న చట్టం 'భారత రేవుల బిల్లు-2025. సామర్థ్యం, స్థిరత్వం, సమగ్రతలపై దృష్టి సారించిన ఈ బిల్లు- రాబోయే దశాబ్దాల్లో నిరంతర విజయాలు, వృద్ధికి ప్రతీకగా భారత సముద్ర రంగాన్ని ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అగ్రభాగాన నిలుపుతుంది.

# మినిమమ్ బ్యాంక్ పరిమితిపై వెనక్కి తగ్గిన ఐసీఐసీఐ బ్యాంక్

## మెట్రోల్లో రూ.15వేలు, పట్టణాల్లో రూ.7500, గ్రామీణ ప్రాంతాల్లో రూ.2500 కనీస బ్యాలెన్స్‌గా నిర్ణయం

న్యూ డిల్లీ ఆగస్టు 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఐసీఐసీఐ బ్యాంక్ మినిమమ్ బ్యాంక్ పరిమితిపై వెనక్కి తగ్గింది. పట్టణ ప్రాంతాల్లో కొత్తగా తీసిన ఖతాదారులకు సేవింగ్ అకౌంట్స్‌లో మినిమమ్ బ్యాలెన్స్ రూ.50వేల పరిమితిని నిర్ణయించిన విషయం తెలిసిందే. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నది. ఆగస్టు నుంచి మెట్రోనగరాల్లో తెరిచిన సేవింగ్ అకౌంట్లపై పరిమితిని ఐదు రెట్లు పెంచింది. ఈ మేరకు ఐసీఐసీఐ బ్యాంక్ తన వెబ్‌సైట్‌లో విడుదల చేసిన నోటీసుల్లో కస్టమర్ల నుంచి వచ్చిన విలువైన అభిప్రాయాల ఆధారంగా అంచనాలు, ప్రాధాన్యానికి అనుగుణంగా నిబంధనలు సవరించినట్లు తెలిపింది. గతంలో సవరిస్తూ జారీ చేసిన ఉత్తర్వును సంహరించుకుంటున్నట్లు పేర్కొంది. మెట్రోల్లో రూ.15వేలు, పట్టణాల్లో రూ.7500, గ్రామీణ ప్రాంతాల్లో రూ.2500 కనీస బ్యాలెన్స్‌గా నిర్ణయించినట్లు తెలిపింది. అంతకు ముందు రూ.5వేలు, రూ,2వేలుగా ఉండేది. మునుపటి పరిమితితో పోలిస్తే కనీస బ్యాలెన్స్ పరిమితిని 50శాతం పెంచింది. కొత్త నిబంధనలు సాలరీ అకౌంట్స్, సీనియర్ సిజిటన్ అకౌంట్స్, పెన్షనర్స్, ప్రైమరీ సేవింగ్ డిపాజిట్ అకౌంట్స్‌కు వర్తించవని పేర్కొంది. అయితే, జులై 31కి ముందు తీసిన ఖాతాలపై కొత్త నిబంధనలు ఎలాంటి ప్రభావం ఉండదని పేర్కొంది. ఇదిలా ఉండగా.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, కెనరా బ్యాంక్, ఇండియన్ బ్యాంక్‌తో సహా చాలా ప్రభుత్వ రంగ బ్యాంకులు కనీస మొత్తంపై జరిమానాను తొలగించడం, తగ్గించిన విషయం తెలిసిందే. మినిమమ్ బ్యాలెన్స్ అనేది ఖాతాల్లో నిర్వహించాల్సిన కనీస మొత్తం. బ్యాలెన్స్ తక్కువగా ఉంటే బ్యాంకులు ఆరు శాతం.. గరిష్టంగా రూ.500 (ఏది తక్కువైతే అది) జరిమానాగా విధించే అవకాశం ఉంది. ఐసీఐసీఐ బ్యాంక్ నగదు లావాదేవీలకు సంబంధించిన రూల్స్‌ను మార్చింది. కస్టమర్లు నెలకు మూడుసార్లు ఉచితంగా నగదును డిపాజిట్ చేయొచ్చు. మొత్తం రూ.లక్ష వరకు ఉంటుంది. దాని కంటే ఎక్కువ డిపాజిట్లు, లావాదేవీలపై రూ.150 లేదంటే రూ.1000 డిపాజిట్ చేసినందుకు రూ.3.50 (ఏది ఎక్కువైతే అది) వసూలు చేయనున్నది.

# లక్నో మెట్రో రైల్ ప్రాజెక్టు కింద రూ.5,801 కోట్లతో 12 స్టేషన్లు గల 11.165 కి.మీ. 'ఫేజ్-1బి' పనులకు మంత్రిమండలి ఆమోదం

న్యూఢిల్లీ, ఆగష్టు 14:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన ఇవాళ న్యూఢిల్లీలో సమావేశమైన కేంద్ర మంత్రిమండలి ఉత్తరప్రదేశ్‌లోని లక్నో మెట్రో రైల్ ప్రాజెక్టు 'ఫేజ్-1బి' పనులకు ఆమోదం తెలిపింది. ఇది 11.165 మీటర్ల పొడవైన మార్గం కాగా- ఇందులో 7 భూగర్భ, 5 ఎలివేటెడ్- మొత్తం 12 స్టేషన్లు ఉంటాయి. ఇది పూర్తయితే, లక్నో నగరంలో 34 కిలోమీటర్ల మెట్రో రైలు నెట్‌వర్క్ ప్రజలకు అందుబాటులో ఉంటుంది.

ఈ కీలక ప్రాంతాలను మెట్రో నెట్‌వర్క్‌తో జోడించే 'ఫేజ్-1బి'తో అనుసంధానం మరింత మెరుగవుతుంది. దాంతోపాటు ఆర్థిక కార్యకలాపాలకు ఉత్తేజం, పర్యాటక రంగానికి ప్రేరణ లభిస్తాయి. స్థానిక ప్రజలకు, సందర్శకులకు పట్టణ రవాణా సౌలభ్యం ఇనుమడిస్తుంది.

వాహన రద్దీ తగ్గుదల: రోడ్డు రవాణాతో పోలిస్తే మెట్రో రైల్ నెట్‌వర్క్ సహజంగానే చౌకైన ప్రత్యామ్నాయం. ఈ నేపథ్యంలో 'ఫేజ్-1బి' ద్వారా లక్నో నగరంలో మెట్రో రైలు నెట్‌వర్క్ పొడిగింపుతో రహదారులపై వాహన రద్దీ తగ్గుతుందని అంచనా. ముఖ్యంగా అమిత రద్దీగా కనిపించే పాత లక్నో మార్గాల్లో ఈ ప్రభావం అధికంగా ఉంటుంది. దీనివల్ల వాహన రాకపోకలు సజావుగా సాగి, ప్రయాణ సమయం కలిసిరావడమేగాక రహదారి భద్రతకూ భరోసా లభిస్తుంది.

పర్యావరణ ప్రయోజనాలు: లక్నో నగరంలో 'ఫేజ్-1బి' మెట్రో రైలు ప్రాజెక్ట్ అదనంగా అందుబాటులోకి వస్తే పర్యావరణానికీ మేలు కలుగుతుంది. ఈ మేరకు సంప్రదాయ శిలాజ ఇంధన ఆధారిత రవాణాతో పోలిస్తే కర్బన ఉద్గారాలు గణనీయంగా తగ్గుతాయి.

ఆర్థిక వృద్ధి: ప్రయాణ సమయం తగ్గుదలతోపాటు నగర పరిధిలోని విమానాశ్రయం, రైల్వే స్టేషన్లు, బస్సు డిపోల వంటి వివిధ ప్రాంతాలకు రవాణా సౌలభ్యం మెరుగుపడుతుంది. ఉద్యోగులు, కార్మికులు తమ కార్యాలయాలకు, పని ప్రదేశాలకు స్వల్ప వ్యయంతో సకాలంలో చేరుకోగలరు కాబట్టి ఉత్పాదకత కూడా ఇనుమడిస్తుంది. అనుసంధానం మెరుగుదల వల్ల స్థానిక వ్యాపారాలకు... ముఖ్యంగా కొత్త మెట్రో స్టేషన్ల సామీప్య ప్రాంతాల్లో ఊపు లభిస్తుంది. అలాగే లోగడ సౌలభ్య లోపంగల ప్రాంతాల్లో పెట్టుబడులకు, ప్రగతికి అవకాశం ఉంటుంది. సామాజిక ప్రభావం: లక్నోలో 'ఫేజ్-1బి' మెట్రో రైలు నెట్‌వర్క్ విస్తరణ వల్ల ప్రజా రవాణా ప్రజలందరికీ సమానంగా అందుబాటులోకి వస్తుంది. తద్వారా విభిన్న సామాజిక-ఆర్థిక వర్గాలకు ప్రయోజనం కలుగుతుంది. రవాణా సౌలభ్యంలో అసమానతలు తగ్గి, ప్రయాణ సమయం ఆదా కావడం ద్వారా నిత్యావసర సేవల లభ్యత మెరుగుపడి జనజీవన నాణ్యత ఇనుమడిస్తుంది.

లక్నో మెట్రో రైలు ప్రాజెక్ట్ 'ఫేజ్-1బి' నగర పరిణామాత్మక ప్రగతికి ఇతోధికంగా తోడ్పడుతుంది. అనుసంధానం పెరుగుదల, వాహన రద్దీ తగ్గుదల, పర్యావరణ ప్రయోజనాలు, ఆర్థిక వృద్ధి, జనజీవన నాణ్యత మెరుగుదల వగైరాలకు భరోసా ఇస్తుంది. పట్టణ ప్రాంతాల్లో కీలక సమస్యలకు పరిష్కారం చూపడం, భవిష్యత్ విస్తరణకు పునాది వేయడం ద్వారా నగర పురోగమనం, సుస్థిరత సాధనలో కీలక పాత్ర పోషిస్తుంది.

# రక్తపోటును, మధుమేహాన్ని నియంత్రించడానికి చేపట్టిన చర్యలు

న్యూఢిల్లీ, ఆగష్టు 14:ఆరోగ్యం రాష్ట్ర జాబితాలో ప్రస్తావించిన అంశం. ఏమైనా, జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో భాగంగా అసాంక్రామిక వ్యాధుల నివారణ, నియంత్రణలకు ఉద్దేశించిన జాతీయ కార్యక్రమం (ఎన్‌పీ-ఎన్‌సీడీ)లో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సాంకేతిక సహాయంతో పాటు ఆర్థిక సహాయాన్ని కేంద్ర ఆరోగ్య శాఖ అందిస్తోంది. ఈ కార్యక్రమం మౌలిక సదుపాయాలను పటిష్ఠపరచడంపైన, మానవ వనరులను పెంచడంపైన, పరీక్షలు, ముందుగా రోగనిర్ధారణ, సిఫారసు సేవ, చికిత్సతో పాటు రక్తపోటు, మధుమేహం సహా అసాంక్రామిక వ్యాధుల (ఎన్‌సీడీస్) విషయంలో మానవ ఆరోగ్య పరిరక్షణ.. ఈ అంశాల్లో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల అవసరాలు, అవి పంపే ప్రతిపాదనలపై ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకొంటోంది. ఈ కార్యక్రమం కింద 77 జిల్లా ఎన్‌సీడీ క్లినిక్‌లు, 233 కార్డియాక్ కేర్ యూనిట్లతో పాటు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో 6,410 ఎన్‌సీడీ క్లినిక్‌లను ఏర్పాటు చేశారు.

రక్తపోటు, మధుమేహం సహా సాధారణ ఎన్‌సీడీల పరీక్షలు, నివారణతో పాటు నియంత్రణే ధ్యేయంగా జనాభా ఆధారిత కార్యక్రమాన్ని ఎన్‌హెచ్‌ఎంలో భాగంగా ప్రారంభించారు. సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణలో ఎన్‌హెచ్‌ఎం ఒక భాగంగా ఉంటుంది. 30 ఏళ్ల కంటే ఎక్కువ వయసున్న వారికి ఈ కార్యక్రమంలో భాగంగా పరీక్షలు నిర్వహించారు.

వయస్సు 30 ఏళ్లు, అంత కన్నా ఎక్కువ ఉన్న వారందరికీ పరీక్షలు నిర్వహించడానికి గత ఫిబ్రవరి 20 నుంచి గత మార్చి నెలాఖరు వరకు రక్తపోటు, మధుమేహం సహా ఎన్‌సీడీ పరీక్షల కార్యక్రమాన్ని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మొదలుపెట్టింది. ఈ కార్యక్రమాన్ని ఎన్‌పీ-ఎన్‌సీడీ కింద దేశవ్యాప్తంగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల (ఏఏఎం)లతో పాటు ఇతర ఆరోగ్య సంరక్షణ కేంద్రాల్లో నిర్వహించారు.

ఎన్‌పీ-ఎన్‌సీడీ కార్యక్రమంలో భాగంగా రక్తపోటు, మధుమేహం సోకినట్లు నిర్ధారణ అయిన రోగులకు వేర్వేరు స్థాయిలకు చెందిన ఆరోగ్య సంరక్షణ కేంద్రాల్లో మందులతో పాటు క్రమం తప్పక సమీక్షా సేవల్ని కూడా అందిస్తున్నారు:

రోగులకు, వారి కుటుంబ సభ్యులకు జీవనశైలిని మెరుగుపరచుకోవడంతో పాటు నష్టం సంభవించే అవకాశాన్ని (రిస్క్) తగ్గించుకొనే విషయాలపై సూచనలు, సలహాలను జిల్లా ఎన్‌సీడీ క్లినికల్ కౌన్సెలర్లు అందిస్తారు. అసాంక్రామిక వ్యాధుల నివారణ, నిర్వహణలకు సంబంధించిన ఐఈసీ (ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్) కార్యకలాపాలను కూడా వీరు నిర్వహిస్తారు. రోగులు ఆరోగ్యశాలలకు వచ్చినప్పుడు జీవనశైలిని ఎలా తీర్చిదిద్దుకోవాలో వైద్యాధికారులు, నర్సులు తెలియజెబుతారు.

గుర్తింపు పొందిన సంఘ సేవా కార్యకర్తలే 'ఆశా' (అక్రిడిటెడ్ సోషల్ హెల్త్ యాక్టివిస్ట్ .. ఏఎస్‌హెచ్‌ఏ)లు. 30 ఏళ్లు, అంత కన్న ఎక్కువ వయసున్న వారికి నష్టభయం (రిస్క్) ఏ మేరకు ఉందో ఆశా కార్యకర్త కమ్యూనిటీ ఆధారిత నిర్ధారణ పట్టిక (సీబీఏసీ) ఫారాలను ఉపయోగించి, పరిశీలిస్తారు. రక్తపోటు, మధుమేహం సహా సాధారణ ఎన్‌సీడీల తనిఖీ కోసం వ్యక్తులను ఆశా వర్కరే ఏఏఎంల (ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల) వద్దకు తీసుకొస్తారు. క్రమం తప్పక ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ, వ్యాధిని చాలా ముందే గుర్తించడానికి ఇవ్వాల్సిన ప్రాధాన్యాన్ని ప్రజలకు ఆశా కార్యకర్తే వివరిస్తారు. రోజూ ఎంత ఆహారాన్ని తీసుకోవడం మంచిది, శారీరకంగా వ్యాయామం చేయడం, పొగ తాగే లేదా మద్యం తాగే అలవాట్లను మానుకోవడం, వేళకు మందులు వేసుకొంటూ ఉండడం వంటి అంశాల్లో రోగులకు సలహాలను ఇచ్చే విషయాల్లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌ఓ)లకు, ఏఎన్ఎంలకు, 'ఆశా'లకు శిక్షణనిచ్చారు.

ఈ వివరాలను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ ప్రతాప్‌రావ్ జాదవ్ రాజ్యసభకు ఈ రోజు రాతపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో తెలిపారు.

# స్పైసెస్ పథకం ద్వారా పసుపు ఎగుమతులకు ప్రభుత్వ ప్రోత్సాహం

న్యూఢిల్లీ, ఆగష్టు 14:సుగంధ ద్రవ్యాల బోర్డు ద్వారా భారత ప్రభుత్వం "సుగంధ ద్రవ్యాల రంగ ఎగుమతుల్లో ప్రగతిశీల, వినూత్న, సహకార చర్యల ద్వారా సుస్థిరత (స్పైస్డ్)" పథకాన్ని అమలు చేస్తోంది. దీని ద్వారా పసుపుతో సహా ఇతర సుగంధ ద్రవ్యాల ఎగుమతులను ప్రోత్సహించేందుకు వివిధ కార్యక్రమాలను చేపడుతోంది. దీనిలో ఆహార భద్రత, నాణ్యతకు హామీ ఇచ్చే వ్యవస్థలు/ధ్రువీకరణల అమలు, దిగుబడి అనంతరం నాణ్యతను పెంపొందించడం, శుద్ధి చేయడానికి, విలువను జోడించేందుకు తోడ్పాటు, నాణ్యతను పెంపొందించడం, ఔత్సాహిక పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించే దిశగా పసుపు రంగంలో ఉన్న వారికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం, దిగుమతి చేసుకొనే దేశాల ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా ఎగుమతి చేసే పసుపు నాణ్యతను ప్రయోగశాలల్లో అంచనా వేయడం, రైతులు/రైతు సంఘాలు, ఎగుమతిదారులు/శుద్ధిచేసేవారు, అంతర్జాతీయ కొనుగోలు దారుల మధ్య నేరుగా మార్కెట్ అనుసంధానాన్ని ఏర్పాటు చేయడానికి కొనుగోలుదారులు, విక్రేతల సంఘాలు (దేశీయం/అంతర్జాతీయం)తో సమావేశాలను నిర్వహించడం తదితరమైనవి ఉన్నాయి.

# ప్రజల పక్షాన అలుపెరుగని పోరాటం చేస్తాం.. సీపీఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి

కరీంనగర్, ఆగష్టు 14: సీపీఐ ప్రజల పక్షాన అలుపెరుగని పోరాటం చేస్తుందని సీపీఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని సీ ప్రభాకర్ భవనంలో సీపీఐ పార్టీ విస్తృత స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారత కమ్యూనిస్టు పార్టీ 100 ఏళ్ల ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొనీ జిల్లాలో జైత్రయాత్ర మాదిరిగా ఎర్రజెండాలతో ప్రదర్శనలు నిర్వహించాలన్నారు.

పార్టీ చరిత్రను పల్లె పల్లెకు వివరించాలని పిలుపునిచ్చారు. ఈనెల 20 నుంచి 22 వరకు మేడ్చల్ జిల్లా కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర మహాసభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న వ్యతిరేక విదానాలను, కార్మిక, ప్రజా రైతు సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు.

భవిష్యత్తు పోరాటాలకు నాందిగా మహాసభలో ఉద్యమ కార్యచరణ రూపొందిస్తామన్నారు. అనంతరం జిల్లా పార్టీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా చెన్న విశ్వనాథం, సహాయ కార్యదర్శిగా ఇరుగురాల భూమేశ్వర్, జిల్లా కార్యవర్గ సభ్యులుగా వెన్న సురేష్, సుతారి రాములు, ఎండి ముక్రం, మునుగూరి హన్మంతు, కొక్కుల శాంత, ఎన్నం రాధా, వెన్న మహేష్, ఎర్దండి భూమయ్య, ఉస్మాన్ అక్రమ్ పాషా, శనిగారపు ప్రవీణ్, మహమ్మద్ మౌలానా, మల్లాపూర్ రాజన్నలను ఎన్నుకున్నారు. ః

నూతన కార్యవర్గాన్ని వెంకటరెడ్డితో పాటూ నాయకులు రాష్ట్ర నాయకులు కలవేని శంకర్ అభినందించారు. ఈమేరకు చాడ వెంకటరెడ్డిని సత్కరించిన జిల్లా నాయకులు మినట్ బుక్కు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పూర్వీకుల త్యాగాలను స్మరించుకుందాం : షేక్ అబ్దుల్ బాసిత్



ఖమ్మం, ఆగష్టు 14:స్వాతంత్ర్య దినోత్సవం అంటే జెండా ఆవిష్కరణ మాత్రమే కాదని, బానిస సంకెళ్లు తెంచడానికి మన పూర్వీకులు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ, నీతి నిజాయితీగా దేశ అభివృద్ధి కోసం కృషి చేసే సంకల్పం చేసుకోవడమేనని మోడ్రన్ ఇఖ్రా స్కూల్ కరస్పాండెంట్ షేక్ అబ్దుల్ బాసిత్ అన్నారు. గురువారం కొత్తగూడెం కార్పొరేషన్ 12వ వార్డులోని సుభాష్ చంద్రబోస్ నగర్‌లో గల మోడ్రన్ ఇఖ్రా స్కూల్‌లో ముందస్తుగా స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా దేశ సార్వభౌమత్వం, సమగ్రత, కుల మతాలకు అతీతంగా అందరం కలిసి కట్టుగా జీవిస్తూ దేశాభివృద్ధికి కృషి చేయాలన్న విద్యార్థుల ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఈ కార్యక్రమంలో ప్రధాన అధ్యాపకురాలు పర్వీన్ సుల్తానా, టీచర్లు లక్ష్మి ప్రసన్న, శిరీషా, నీలా, నసురత్, సల్మా, సరస్వతి, విజయలక్ష్మి, నాజీయా, సుహాన, ఖాజా పాల్గొన్నారు.

# రాష్ట్రంలోనే అత్యధికంగా పట్టణానికి డబుల్ బెడ్ రూం ఇండ్లు.. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల, ఆగస్టు 14 : రాష్ట్రంలోనే జగిత్యాల పట్టణానికి అత్యధికంగా డబుల్ బెడ్ రూం ఇండ్లు మంజూరయ్యాయని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ వెల్లడించారు.

జగిత్యాల పట్టణంలో 41, 42, 43 ,46 వార్డులలో రూ.1 కోటి 30 లక్షలతో అభివృద్ధి పనులకు గురువారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యధిక నిధులు జగిత్యాల కు మంజూరు చేయటం జరిగిందని వెల్లడించారు.

రూ.150 కోట్లతో జగిత్యాల పట్టణంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు.

అభివృద్ధితో పాటు పచ్చదనం పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజల సహకారంతోనే పట్టణం అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు.

జగిత్యాల అర్బన్ హౌసింగ్ కాలనీ మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం రూ.20 కోట్ల నిధులు మంజూరు చేయటం జరిగిందని, అధికారులు త్వరితగతిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అభివృద్ధి పనుల విషయంలో ఆటంకం కలిగించవద్దని, అని ప్రతిపక్షాలను కోరారు. 40 ఇండ్లు కట్టని నాయకులు ఇతర నియోజకవర్గం నుండి ఇక్కడికి వచ్చి 4500 ఇండ్ల మౌలిక వసతులు పై మాట్లాడడం హాస్యాస్పదమని అన్నారు. ముఖ్యంగా పట్టణ ప్రజలు తమ ఇంటి చెత్తను మున్సిపల్ సిబ్బందికి ఇచ్చేముందు తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలన్నారు. తన ఇంటి నుండే తడి, పొడి చెత్త సేకరణ ప్రారంభం కావాలని, చెత్త సేకరణ వేరు చేయకుంటే చెత్త తీసుకోవద్దు అని మున్సిపల్ కార్మికులను కోరారు. ఏదో ఒక సందర్భంలో మార్పు రావాలన్నారు.

డంపింగ్ యార్డు లో ప్రహరీ కి 2 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని, ఇప్పటి వరకే 5 కోట్ల నిధులు చెత్త శుద్ధికి మంజూరు చేయటం జరిగిందన్నారు.

పచ్చదనం పరిశుభ్రత విషయంలో జగిత్యాల ఆదర్శంగా ఉండేలా చేయాల్సిన బాధ్యత అందరిదని ఎమ్మెల్యే సంజయ్ తెలిపారు.

రాజకీయాలకు అతీతంగా పట్టణం అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు.పట్టణం అభివృద్ధికి ప్రజలకు సేవలకుగాను ప్రతీ వార్డుకు వార్డు అధికారులను ప్రభుత్వం నియమించిందన్నారు. వచ్చే ఎన్నికల కోసం కాదు వచ్చే తరం కోసం పనిచేయాలన్నారు. అర్హులు అందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామన్నారు.

రూ.203 కోట్ల తో నూతన ఆసుపత్రి మంజూరు చేసినట్లు వివరించారు. ప్రజలందరూ మత సామరస్యాన్ని కాపాడాలని, ప్రతీ ఒక్కరూ వారి మతాన్ని ప్రేమిస్తూ ఇతర మతాలను గౌరవించాలని, హింస అనేది అభివృద్ధికి ఆటంకమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్పందన మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మన్సూర్, నాయకులు అబ్దుల్ ఖాదర్ ముజాహిద్, ఖాజీం అలీ, కో ఆప్షన్ హసిబొద్దిన్, మాజీ కౌన్సిలర్ లు కప్పల శ్రీకాంత్, ఫిర్దోస్ తరుణం, బాలె శంకర్, తోట మల్లికార్జున్, కూతురు పద్మ శేఖర్, కూతురు రాజేశ్, బోడ్ల జగదీశ్,డిష్ జగన్ పంబాల రాము, అహమ్మద్, అంగడి సాయి, ఏ ఓ శ్రీనివాస్ డీఈ ఆనంద్,వరుణ్, ఏఈ శరన్ అనిల్, పెద్దింటి రాజు, దుమాల రాజ్ కుమార్,ఫిరోజ్,జావేద్, జమీల్, లింగారెడ్డి, గంగాధర్, వార్డు ఇంచార్జ్ అధికారులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# వలసపాలకుల్ని తరిమికొట్టిన ఆ ఉద్యమ స్ఫూర్తి నేడేది ?



## ప్రస్తావన :

1947లో బ్రిటిష్ పాలన నుండి స్వాతంత్ర్యం పొందిన సందర్భంగా భారతదేశం ఆగస్టు 15, 2025న 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోనుంది. ప్రధానమంత్రి ఎర్రకోటలో ప్రసంగం కోసం పౌరుల ఆలోచనలను ఆహ్వానించారు, ఇది సమగ్ర దేశ నిర్మాణం కోసం. ఈ రోజు దేశభక్తి ఉత్సాహం, ఐక్యత, ప్రగతిశీల ప్రజాస్వామ్యంగా భారతదేశం యొక్క అభివృద్ధి ప్రతిబింబిస్తుంది. భారతదేశం 1947లో బ్రిటీష్ పాలన నుండి స్వాతంత్ర్యం పొందిన రోజును సూచిస్తూ 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటుంది. ఈ జాతీయ సెలవుదినం. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా, ఒక శక్తివంతమైన రాజ్యంగా రూపుదిద్దుకోవడం గమనార్హం. స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలను ప్రతిబింబిస్తూ, దేశం యొక్క పురోగతి, ఐక్యతగా జరుపుకునే స్వాతంత్ర్య దినోత్సవం, దేశభక్తి భావనతో నిండి ఉంటుంది. "భారతదేశం తన 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోవడానికి సిద్ధమవుతున్నందున, ప్రధానమంత్రి ఆగస్టు 15న ఎర్రకోటపై జాతీయ జండాను ఎగరవేసి, దేశ ప్రజల ఉద్దేశించి ప్రసంగిస్తారు".

79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఈ ఆగస్టు, 15 భారతదేశం నలుమూలల అంబరాన్నంటే సంబరాలు జరుపుకుంటున్న సందర్భంగా.... నాటి 1947 ఆగస్టు, 15 భరతజాతికి అందివచ్చిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు. భారతదేశం యావత్ ప్రజానీకం మొట్టమొదటి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకను ఆనాటి ప్రధానమంత్రి శ్రీ పండిట్ జవహర్ లాల్ నెహ్రూ మువ్వన్నెల జాతీయ జెండాను ఎగరవేసారు. ఆనాటి నుండి ప్రతి ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్న సంప్రదాయం. భారతీయులు ఈనాటి సుఖసంతోషాలకు సారథులైన మహనీయుల త్యాగాల్ని స్మరించుకోవడం ఆనవాయితి. నేడు భారతదేశం అభివృద్ధి చెందిన అగ్రరాజ్యాల చేరువలో, అభివృద్ధిపథాన ముందుకు దూసుకు వెళుతున్న నేపథ్యం, ఈ దేశ స్వాతంత్ర్య సమరంలో మహత్మా గాంధీజీ నాయకత్వంలో స్వాతంత్ర్య సముపార్జనకై, మేముసైతం అంటూ ప్రజలంతా ఏకమై తమవంతు సహకారాన్ని అందించి స్వాతంత్ర్యాన్ని సముపార్జించారు. ఎందరో మహానుభావులు, వారందరికీ ఈ పర్వదినాన వందనాలర్పిస్తూ, గతాన్ని గుర్తు చేసుకోవడం అత్యంత ఆవశ్యకం. కొన్నివందల సంవత్సరాలు ఆంగ్లేయుల ప్రభుత్వపాలనలో అనేక కష్టాలను ఎదుర్కొన్న భారతదేశం దాన్యశృంఖలాలను త్రెంచుకొని సర్వస్వతంత్రమైన రోజు ఆగస్టు 15. భారతదేశంలో కొనసాగిన జాతీయ మహోద్యమం విజయం సాధించిన దినం ఆగస్టు 15. అంతేకాదు, మహత్మా గాంధీజీ నేతృత్వంలో, అనేకమంది మహనీయుల త్యాగాలతో కష్టపడి తాము సముపార్జించుకొన్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అంతర, బహిర దుష్ట శక్తులనుంచి పరిరక్షించుకునేందుకు పునః ప్రతిజ్ఞ చేసే రోజుకూడా ఇదే. భారతదేశం యావత్తు ప్రజానీకం 1947 ఆగస్టు 15 నుండి నేటికి 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సమాయత్తం అవుతున్న సందర్భంగా ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు సాధించుకున్న గత చరిత్రను పునరావృతం చేసుకుందాం...

## భారతదేశ చరిత్ర :

భారతదేశం రత్నగర్భ, కళలకు కాణాచి, ఆధ్యాత్మిక చింతన మెండుగా గల దేశం. భారత, రామాయణాలు, నాలుగు వేదాలు, భగవద్గీత ఆవిర్భవించిన పవిత్ర భూమి. నాడు భారతదేశంలో నివసించే ప్రజలు అనేక జాతులు, కులాలు, మతాలకు ఆలవాలమైనప్పటికీ కలసి జీవిస్తుండేవారు. తదుపరి అఖండ భారతదేశం అంతః కలహాలతో, పరస్పర యుద్ధాలతో, చిన్న చిన్న రాజ్యాలుగా విడిపోయింది. కొందరు మన దేశ రాజులను ఓడించి, మన దేశ సంపదను దోచుకెళ్ళడమేగాక, మన పవిత్ర దేవాలయాలను, సుందరమైన అనేక కట్టడాలను ధ్వంసం చేశారు. అదే అదనుగా బ్రిటీష్‌వారు వ్యాపార నెపంతో భారతదేశంలో అడుగుపెట్టి, పూర్తిగా ఆక్రమించి ప్రజలను బానిసలుగా చూడటమే కాకుండా, చిత్రహింసలు పెడుతూ తిరుగుబాటు చేసిన వారిని అంతమొందించి అజేయంగా కొన్ని వందల సంవత్సరాలు పరిపాలించారు.

## బ్రిటీష్ పరిపాలన :

లాభదాయకమైన సుగంధద్రవ్యాల వ్యాపారార్థం 1498లో వాస్కోడగామా కాలికట్ లోని కోజికోడ్ ఓడరేవులో కాలిడినప్పటినుంచీ ఐరోపా వర్తకుల రాకపోకలు భారత ఉపఖండంలో ప్రారంభమయ్యాయి. భారత ఉపఖండంలో స్వాతంత్ర్య సముపార్జనకై జరిగిన అనేక ఉద్యమాలన్నిటినీ కలిపి "భారత స్వాతంత్రోద్యమము" (భారతీయ స్వాతంత్ర్య పోరాటం)గా పరిగణిస్తారు. అనేక సాయుధ పోరాటాలు, అహింసాయుత పద్ధతిలో జరిగిన ఉద్యమాలు భారత స్వాతంత్రోద్యమములో భాగాలు. భారత ఉపఖండంలోని బ్రిటీష్, ఇతర వలసపాలకుల పాలనను అంతమొందించడానికి వివిధ సిద్దాంతాలను అనుసరించే అనేక రాజకీయపక్షాలు ఉద్యమించాయి. 16వ శతాబ్దంలో బుడతగీచు (పోర్చుగీసు) వారి ఆక్రమణలకు వ్యతిరేకంగా అబ్బక్కరాణి చేసిన పోరాటాలను, 17వ శతాబ్దం మధ్యలో బెంగాల్లో ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటాలను వలస పాలనపై వ్యతిరేకతకు మొదటి అడుగులుగా చెప్పవచ్చు. మొదటి సంఘటిత సాయుధ పోరాటం బెంగాల్లో ప్రారంభమై తరువాత రాజకీయ పోరాటంగా పరిణామం చెంది భారత జాతీయ కాంగ్రెస్‌గా ఆవిర్భవించింది. వీరు మన దేశ స్వాతంత్ర్యము కొరకు పోరాడారు. 1757లో జరిగిన ప్లాసీ యుద్ధంలో రాబర్ట్ క్లైవ్ నేతృత్వంలోని బ్రిటీష్ సైన్యం బెంగాల్ నవాబుపై విజయం సాధించిన భారతదేశంలో ఈస్ట్ ఇండియా కంపెనీ పాలన ప్రారంభమైంది. ఈ యుద్ధం తరువాత బెంగాల్, బీహార్ పాఠశాల ఈస్ట్ ఇండియా కంపెనీ హస్తగతమయ్యాయి. 1765 లో బక్సర్ యుద్ధంలో ఒడిషా కూడా కంపెనీ వశమైంది. 1773 రెగ్యులేటింగ్ చట్టం, 1784 లో చేసిన ఇండియా చట్టం, 1833 చార్టర్ చట్టం మెదలైన చట్టాలు భారతదేశంలో బ్రిటీష్ అధికారాన్ని సుస్థిరం చేసాయి.

1835 లో ఇంగ్లీషును ఆధికారిక భాషగా గుర్తించారు. ఈ సమయంలో ప్రాచ్యవిద్యని అభ్యసించిన హిందూ విద్యావేత్తలు హిందూ ధర్మంలోని సాంఘిక దురాచారాలైన సతీ సహగమనం, కులవివక్ష, బాల్య వివాహాలను రూపుమాపటానికి ఉద్యమించారు. ఈ విధంగా బొంబాయి, మద్రాసులలో ఏర్పడిన సంఘాలు రాజకీయసంఘాలుగా పరిణతి చెందాయి. ఉన్నత విద్యనభ్యసించిన నాటి తొలి సంస్కర్తలు పత్రికలను మిక్కిలి సమర్ధవంతంగా ఉపయోగించుకోవడం కారణంగా ఆనాటి సామాజిక విలువలు, మతసంప్రదాయాలకు ఎక్కువ విఘాతం కలగకుండానే సంస్కరణలు సాధ్యమయ్యాయి. బ్రిటీష్ పాలన వలన పరోక్షంగా ఆధునిక భావజాలం వ్యాప్తిచెందినప్పటికీ, భారతీయులు బ్రిటీష్ వారి వలసపాలన పట్ల వ్యతిరేకతను పెంచుకో సాగారు. ఉపఖండంలో బ్రిటీష్ వారి అధికారం పెరిగేకొద్దీ వారు భారతీయుల ఆచారాలను హేళన చెయ్యడం ఎక్కువయింది. మసీదులలో పార్టీలు చేసుకోవడం, తాజ్ మహల్ పై సైనిక నృత్యాలను ప్రదర్శించటం, రద్దీగా వుండే దారులలో, సంతలలో తమకు అడ్డువచ్చిన వారిని కొరడా



లతో కొట్టడం (ఆధారం హెన్రీ బ్లేక్ జ్ఞాపకాలు), సిపాయిలను అగౌరవంగా చూడటంవంటి ఆగడాలు పెచ్చుమీరాయి. 1839లో మహారాజా రంజిత్ సింగ్ మరణానంతరం 1845-46లో జరిగిన మొదటి ఆంగ్ల సిక్కు యుద్ధం తరువాత 1848-1849 లో జరిగిన రెండవ ఆంగ్ల సిక్కు యుద్ధాల పర్యవసానంగా పంజాబ్, కంపెనీ వశమైంది. ఈ కాలంలో బ్రిటీష్ పార్లమెంటు కొత్తగా ఆక్రమించుకోబడిన రాజ్యాల పరిపాలనార్థమై అనేక శాసనాలు చేసింది. 1849 పంజాబ్ ఆక్రమణ తరువాత అనేక చిన్నచిన్న తిరుగుబాట్లు జరిగాయి, అయితే వీటిని బలవంతంగా అణచివేసారు. 19వ శతాబ్దం మెదట్లో ఈ పద్ధతిలో మౌలికమైన (రాడికల్) మార్పులు వచ్చాయి. కాంగ్రెసులో అతివాదులైన లాలా లజపతిరాయ్, బాలగంగాధర తిలక్, బిపిన్ చంద్ర పాల్, (లాల్ బాల్ పాల్) విదేశీ బహిష్కరణ, సమ్మె, స్వావలంబన మెదలైన పద్ధతులను అవలంభిస్తే, అరబిందో వంటివారు తీవ్ర మార్గాలను అవలంభించారు. మెదటి దశకాలలో సాయుధ విప్లవ పోరాటాలు ప్రారంభమయ్యాయి. మొదటి ప్రపంచయుద్ధ సమయంలో జర్మనీ, అమెరికాలలోని భారత స్వాతంత్ర్య యోధులు ప్రారంభించిన గదర్ పార్టీ సహకారంతో జరిగిన సంఘటిత భారత సిపాయిల తిరుగుబాటు జాతీయోద్యమంలో వచ్చిన మౌలిక మార్పుగా చెప్పవచ్చు. లాల్ (లాలా లజపత్ రాయ్), బాల్ (బాలగంగాధర తిలక్), పాల్ (బిపిన్ చంద్రపాల్) త్రయం, ఆకాలంలో లాల్-బాల్-పాల్ గా ప్రసిద్ధి. వీరిలో ఒకరు. 1928 లో భారతదేశ పర్యటనకు వచ్చిన సైమన్ విచారణ సంగము (సైమన్ కమిషన్) ను వ్యతిరేకిస్తూ లాలా లజపతిరాయి చేసిన ఆందోళన బ్రిటీష్ ఇండియా చరిత్రలో చాల ప్రముఖమైనది. 1920-30 దశాబ్దములో జాతీయకాంగ్రెస్ వారి మెత్తదనపు మితవాద సిద్ధాంతమును విడనాడి తీవ్రజాతీయవాదు లలో లాలా లజపతిరాయి ప్రముఖుడు. 1924 ట్రిబ్యూన్ అను పత్రికలో అనేక వ్యాసములు ప్రచురించెను తద్వారా కాంగ్రెస్ వారు తమ తరఫున హిందు మహాసభను ప్రతినిధిగా నియమించవలసినదని ప్రతిపాదించారు.

### నేటి భారతం

పెద్దలు ఇంకా ఇంకా
ధనవంతులవుతుంటే
పేదలు మరీ మరీ
నిరుపేదలవుతున్నారు
మన అపార మేధాసంపత్తితో
ఏకంగా చంద్రమండలం మీదే
ఇంటికి ప్రణాళిక వేస్తున్నాం
సామాన్యుడి గూడు గోడు మాత్రం
ఏ ప్రభుతా పట్టించుకోదు
కొత్త కొలువులు ఇవ్వకపోగా
ప్రయివేటీకరణ పేరిట
ఉన్నవి ఊడగొడుతున్నారు
ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంటూ
ఉద్యోగులను వదిలించుకుంటున్నారు
కార్మికులకు వేతన సవరణ లేదు
అన్నదాతకు మద్దతు ధర కరవు
ఆ పన్నులూ ఈ పన్నులని విధించి
సంపన్నులను పెంచి పోషిస్తున్నాం
పట్టాలి అవినీతి అక్రమార్కుల భరతం
రచించాలి సరికొత్త భారతం!



-చెన్నాప్రగడ శర్మ
సెల్:9440587567

## భారత స్వాతంత్రోద్యమము :

1919 ఏప్రిల్, 13న ఈ ఆందోళనలకు పరాకాష్ఠగా జలియన్ వాలాబాగ్ దురంతం, ఈ దురంతానికే అమృత్సర్ మారణకాండ అని కూడా అంటారు. పంజాబ్ లోని అమృత్సర్‌లో చట్టానికి వ్యతిరేకంగా నిరసన తెలపటానికి నాలుగు గోడల మధ్య జలియన్ వాలాబాగ్‌లో సమావేశమైన 5000 మంది అమాయక నిరాయుధ ప్రజలపై రెజినాల్డ్ డైయ్యర్ అనే బ్రిటీష్ సైనికాధికారి ప్రధాన ద్వారాన్ని మూసివేసి విచక్షణా రహితంగా కాల్పులకు ఆదేశించాడు. మొత్తం 1,651 మార్లు చేసిన కాల్పులలో 379 మంది ప్రజలు మరణించారని 1,137 మంది గాయపడినారని బ్రిటీష్ వారి అధికారిక అంచనా. అయితే మొత్తం 1,499 మందిదాకా మరణించారని భారతీయుల అంచనా. ఈ దారుణ మారణకాండతో స్వపరిపాలనపై మెదటి ప్రపంచ యుద్ధసమయంలో భారతీయులలో చిగురించిన ఆశలు అడియాశలైనాయి గాంధీ సహాయ నిరాకరణో ద్యమాలు, మొదటి ప్రపంచ యుద్ధసమయంలో జరిగిన మొదటి స్వాతంత్ర్యోద్యమము వ్యాపారాత్మక ప్రదేశాలకే పరిమితమై దేశ ఏకీకరణకు పిలుపునివ్వక సామాన్య ప్రజలకు దూరంగానే నిలిచిపోయిందని చెప్పవచ్చు. 1930వ దశకంలో మోహన్ దాస్ కరంచంద్ గాంధీ భారత రాజకీయాలలోకి ప్రవేశించటంతో దేశ ఏకీకరణ ప్రారంభమైనది.

### అసలు స్వరాజ్యం అంటే

స్వాతంత్ర్య పర్వ దినం అంటే
అదొక దివ్య దినము వింటే
స్వాతంత్ర దినం అంటే
మువన్నెల జెండా
రెపరెపలు గాదు
విను వీధులెగిరే
రంగురంగుల కాగిత
తోరణాలు కాదు
సంగీత సైనిక కవాతులు కాదు.
ఆకాశాన విమాన
విన్యాసాల స్వాగతాలు కాదు
రాజకీయ నాయకుల ఉత్తిత్తి
ప్రసంగాలు అసలే గాదు
అది.....మన
నరనరాన దేశభక్తి నిండే చైతన్య
రుధిర ప్రవాహం
అణువణువునా దేశమాత రక్షణకై
గుండెల నినాదం .
పూర్ణ స్వాతంత్రం అంటే....
వర్ణ రహిత స్థితి ..వర్ణ రహిత గతి
ఆత్మగౌరవ వృద్ధి ..కరుణారససిద్ధి
పూర్ణ ప్రజాస్వామ్యం అంటే..
జనం మనం సమ్మేళన
వైరి భావ నిర్మూలన
సమతా సహజీవన
క్షామరహిత కేదారం
సార క్షేత్ర శ్యామలం
నిజ స్వరాజ్యం అంటే..
దేశ ప్రజల ధన ధాన్య సవృద్ధి
సంతులిత సకల ప్రాంత అభివృద్ధి
అందరికీ ఉచిత వైద్య విద్య లబ్ధి
అర్హులకు సముచిత ఉద్యోగ లబ్ధి.
మన ప్రజాస్వామ్య దేశమంటే
అందరికీ సమాన న్యాయ పాలన
అవినీతి రహిత ప్రజా యోజన
నవ్య ఘన సనాతన జనజీవన.
నవ్య దివ్య భారత మంటే
ఆబాల గోపాలమూ
అన్యోన్య భూగోళమూ
ఆనందానంద సౌభాగ్యమూ
బుద్ధ భగవానుని సందేశమూ
నిజమైనప్పుడు
నైజమైనప్పుడు.
అపుడే నిజమైన స్వాతంత్ర్య వేడుక
అపుడే అది స్వరాజ్య జాతీయ గీతిక
ప్రగతి పథ నిర్మాణానికి అదే వేదిక.
జై భారత్.. జైహింద్
సర్వేజనా సుఖినోభవంతు
ఓం శాంతి శాంతి శాంతిః



-రాఘవ మాస్టారు కేదారి
9742407099

## మెదటి సహాయ నిరాకరణోద్యమము :

మెదటి సత్యాగ్రహ ఉద్యమము బ్రిటన్ నుండి దిగుమతి చేసుకునే మిల్లు వస్త్రాలకు మారుగా భారతదేశంలో తయారయిన ఖద్దర్ని ఉపయోగించాలని పిలుపునిచ్చింది, అదియే కాక బ్రిటీషు విద్యాసంస్థలను, న్యాయస్థానాలని బహిష్కరించాలని, ప్రభుత్వ ఉద్యోగాలను విడనాడాలని, పన్ను చెల్లింపులు నిలిపివేయాలని, బ్రిటీష్ వారి సత్కారాలను, బిరుదులను తిరస్కరించాలని పిలుపునిచ్చింది. 1919 లో చేయబడిన నూతన భారత ప్రభుత్వ చట్టాన్ని ప్రభావితం చేయటంలో చాలా ఆలస్యంగా ప్రారంభమైన సత్యాగ్రహోద్యమము విఫలమైనప్పటికీ భారతదేశంలో విస్తృత ప్రజాదరణ పొందింది. తత్ఫలితంగా పెద్దయెత్తున పాలనను స్తంభింపజేసి విదేశీ పాలనకు తీవ్రమైన ఒడిదుడుకులను కలిగించింది. అయితే ప్రజాగ్రహానికి గురియై 21 మంది రక్షకభటులు మరణించిన చౌరి చౌరా సంఘటనతో గాంధీ మెదటి సత్యాగ్రహోద్యమాన్ని విరమించారు.

1920 లో కాంగ్రెస్‌ను పునర్వ్యవస్థీకరించి నూతన విధివిధానాలు రూపొందించారు. స్వరాజ్యం వీటి లక్ష్యం. కాంగ్రెస్ సభ్యత్వనమోదు నరళీకరింపబడి నామమాత్రపు రుసుము చెల్లించటానికి అంగీకరించిన వారందరికీ అందుబాటులోకి వచ్చింది. స్వేచ్ఛాయుత విధానాల స్థానే నిర్దిష్ట నియంత్రణ కలిగి క్రమశిక్షణను పెంపొందించేందుకు అనేక స్థాయిలలో సంఘాలను ఏర్పరిచారు. వీటన్నిటి ఫలితంగా శిష్టజన వర్గాలకే పరిమితమైన సంస్థ నుండి జనాధరణ, జన భాగస్వామ్యం గల రాజకీయ పక్షంగా కాంగ్రెస్ రూపాంతరం చెందింది. 1922లో గాంధీకి ఆరుసంవత్సరాల కారాగార శిక్ష విధించారు, కానీ రెండు సంవత్సరాల కారాగార వాసానంతరం విడిచి పెట్టారు. కారాగారవాసం తరువాత గాంధీ సబర్మతీ నదీ తీరంలో సబర్మతి ఆశ్రమాన్ని స్థాపించారు. అచటినుండి యంగ్ ఇండియా అనే వార్తాపత్రికను నడపటంతో పాటు హిందూ సమాజంలో వెనకబడిన, దళిత, అస్పృశ్య, పేద ప్రజల కోసం అనేక సంఘ సంస్కరణలను ప్రారంభించారు. ఈ కాలంలోనే కాంగ్రెస్ పార్టీలోకి క్రొత్త తరం ప్రవేశించింది. చక్రవర్తి రాజగోపాలాచారి, జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, సుభాష్ చంద్రబోస్ వీరిలో కొందరు. తరువాతి కాలంలో వీరు గాంధేయవాద విలువలననుసరించినా వాటితో విభేదించినా (భారత జాతీయ సైన్యం) భారత స్వాతంత్ర్య వాణిని స్పష్టంగా వినిపించారు. భారత రాజకీయాలు స్వరాజ్య పార్టీ, హిందు మహాసభ, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వంటి అనేక మితవాద, అతివాద సంస్థల ఆవిర్భావంతో విస్తృతమయ్యాయి. మద్రాసులో బ్రాహ్మణేతరుల, మహారాష్ట్రలో మాహరుల, పంజాబులో సిక్కుల ప్రయోజనాలకు ప్రాంతీయ రాజకీయ పక్షాలు ప్రాతినిధ్యం వహించాయి. మహాకవి సుబ్రహ్మణ్య భారతి, వన్చినాథన్, నీలకంఠ బ్రహ్మచారి వంటి బ్రాహ్మణ ప్రముఖులు కూడా తమిళనాడులో స్వాతంత్ర్య సాధనకు, అన్ని కులాల ప్రజల సమానత్వానికై పోరాడారు.

## క్విట్ ఇండియా ఉద్యమం :

భారతీయులను రెండవ ప్రపంచ యుద్ధంలోకి పంపించటానికి నిరసనగా భారతదేశ స్వాతంత్ర్యానికి గాంధీ ఇచ్చిన పిలుపు నందుకుని 1942 ఆగస్టులో క్విట్ ఇండియా ఉద్యమము ప్రారంభమైనది. యుద్ధం ప్రారంభమైన తరువాత 1939 సెప్టెంబరు మాసంలో వార్ధాలో జరిగిన కాంగ్రెస్ పక్ష కార్యనిర్వహణ సంఘ సమావేశాలలో ఫాసిజానికి వ్యతిరేకంగా షరతులతో కూడిన మద్ధతునిస్తూ కాంగ్రెస్ తీర్మానించింది. అందుకు ప్రతిఫలంగా కోరిన యుద్ధానంతర భారత స్వాతంత్ర్యయాన్ని బ్రిటీష్ వారు త్రిరస్కరించటం జరిగింది. 1942లో ఐరోపా, ఆగ్నేయ ఆసియాలో ప్రతికూలించిన యుద్ధ పరిస్థితులలో భారత ఉపకండం అన్యమస్కంగా యుద్ధంలో పాల్గొనటం, బ్రిటీష్ భారత సైన్యంలో, భారతీయులలో పెరిగిన అసంతృప్తి బ్రిటీష్ వారిని భారతదేశాన్ని బుజ్జగించేందుకు ప్రేరేపించాయి.

యుద్ధానంతరం భారతీయులకు అధికార బదలాయింపుకు ప్రతిఫలంగా యుద్ధంలో భారతీయుల సంపూర్ణ మద్దతు కూడగట్టటానికి బ్రిటీష్ వారు క్రిప్స్ ఆధ్వర్యంలో రాయబార బృందాన్ని భారతదేశానికి పంపించటం జరిగింది. అయితే స్వపరిపాలనకు నిర్దిష్ట సమయాన్ని సూచించలేకపోవటం, ఆధికార బదలాయింపుకు సరైన నిర్వచనాన్ని ఇవ్వలేక పోవటంతో పరిమితమైన పాలనాధికారాన్ని మాత్రమే ఇవ్వజూపిన క్రిప్స్ రాయబారం భారత ఉద్యమకారులకు ఆమోదయోగ్యంకాలేదు.

దీనితో చర్చ విఫలమైనాయి. కాంగ్రెస్ క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రారంభించింది. ఉద్యమం యొక్క ముఖ్య ఉద్దేశం బ్రిటీష్ ప్రభుత్వాన్ని రెండవ ప్రపంచ యుద్ధంలో చేసిన సహాయాన్ని అడ్డంపెట్టుకుని బేరసారాలకి దించడమే. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ 1942 ఆగస్టు 8న క్విట్ ఇండియా తీర్మానాన్ని ఆమోదించింది. ఆ తీర్మానంలో కాంగ్రెస్ బ్రిటీష్ ప్రభుత్వం భారత ప్రజల కోరికలను ఆమోదించనట్లయితే దేశవ్యాప్త సత్యాగ్రహానికి పిలుపునిచ్చింది.

## రాయల్ ఇండియన్ నేవీ తిరుగుబాటు :

1946 ఫిబ్రవరి 18లో ముంబాయిలో ఓడలలోను, రేవులలోను "రాయల్ ఇండియన్ నేవీ"లో పనిచేసే భారతీయ నావికుల సమ్మె, తదనంతర తిరుగుబాటు, రాయల్ ఇండియన్ నేవీ తిరుగుబాటుగా పిలువబడ్డాయి. భారత జాతీయ సైన్యపు కథనాలతో ఉత్తేజితులైన భారతీయులు ఈ సమ్మెకు భారీ మద్దతునిచ్చారు. పలు ప్రదర్శనల ద్వారా ఈ తిరుగుబాటుకు మద్దతు లభించింది. వీటిలో బోల్షివిక్-లెనినిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా, సిలోన్ అండ్ బర్మా వారి పిలుపుతో జరిగిన ఒక



రోజు ముంబయ్ సార్వత్రిక సమ్మె కూడా ఒకటి. ఈ సమ్మె ఇతర నగరాలకు వ్యాపించింది. వాయుసేన, ఆయా నగరాల ప్రాంతీయ పోలీసులు కూడా సమ్మెలో దిగారు. నావికాదళ సభ్యులు తమను తాము "భారత జాతీయ నావికాదళం"గా ప్రకటించుకొని, బ్రిటీష్ అధికారులకు ఎడమచేతి అభివాదాలు (సెల్యూట్) చేయనారంభించారు. కొన్ని చోట్ల, భారత బ్రిటీష్ సైన్యంలోని, నాన్ కమిషన్డ్ అధికార్లు బ్రిటీష్ ఉన్నతాధికార్ల ఉత్తర్వులను బేఖాతరు చేసి ఉల్లంఘించారు. చెన్నై, పూనెలలోని బ్రిటిష్ సైనిక శిబిరాలలో సైతం తిరుగుబాటు గాలులు వీచాయి. కరాచి మొదలుకొని కలకత్తా వరకు భారీ విధ్వంసకాండ జరిగింది. ఓడలపై మూడు జెండాలు (కాంగ్రెసు, ముస్లిం లీగు, కమ్యునిస్టు పార్టీ ఆఫ్ ఇండియా), తిరుగుబాటు దారుల సామరస్యానికి ప్రతీకగా ఎగురవేయబడటం ప్రఖ్యాతిగాంచింది.

### పంద్రాగస్టు

పంద్రాగస్టంటే?
జెండా వందనాలు..జాతీయ గీతాలాపనలు
మాత్రమే కాదు..!
పంద్రాగస్టంటే?
నాటి సమర యోధుల పోరాటాలు
అమరవీరుల త్యాగాలు
ఊరూవాడా ఉప్పొంగే దేశభక్తితో
ప్రభంజనంలా కదిలివచ్చి
స్వాతంత్ర్య సంగ్రామంలో
స్వచ్ఛందంగా పాలుపంచుకున్న
ధీర జనాల వీర గాథలు
బ్రిటీష్ సామ్రాజ్యవాదుల
బానిసపాలనలో బలైపోయిన
అసంఖ్యాక జన మానప్రాణాల సంఘటనలు..
మననం చేసుకోవాల్సిన దినం!
పంద్రాగస్టంటే...
భారత స్వాతంత్ర్యోద్యమానికి
ప్రధాన కర్తలు, మహనీయులైన
మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ
బాలగంగాధర్ తిలక్, భగత్ సింగ్
వల్లభాయ్ పటేల్, రాజేంద్రప్రసాద్
సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజుల
వంటి వారిని స్మరించుకోవాల్సిన దినం!
ఆ త్యాగమూర్తుల వీర చరిత్రలను
నేటి తరాలకు వివరించాల్సిన దినం!
భరతమాత దాస్యశృంఖలాలను ఛేదించి
స్వాతంత్ర్య ఫలాలను అందించిన
ఆనాటి త్యాగధనుల స్ఫూర్తి..
దేశ ప్రగతికి మూలబంధమై
భిన్నత్వంలో ఏకత్వానికి వారసత్వమై
జాతి సౌభ్రాతృత్వానికి చైతన్యమై
ప్రజాస్వామ్యానికి రక్షణై
అవినీతి పరులకు సింహస్వప్నమై
భావితరాలకు మార్గదర్శకమై
భారత్ పురోగమనంలో రాణిస్తే?
అది విశ్వానికే మకుటాయమానం కాదా?
-2047కి
'వికసిత భారత్' గా రూపొందదా?



-పి.వి.ప్రసాద్
9440176824

## స్వాతంత్ర్య సమరంలో ఊపందుకున్న క్షణాలు

భారతదేశం స్వాతంత్ర్యానికి మునుపు ఆంగ్లేయులు పాలిస్తున్న కాలంలో ప్రజలలో భయం, ప్రజలలో అభద్రతా భావంతో బ్రతుకును వెళ్ళదీస్తున్న తరుణం. ప్రజలలో ఆ భయాన్ని పోగొట్టటానికే ప్రముఖ జాతీయ నాయకులంతా కలిసి కట్టుగా మహత్మాగాంధీజీ నాయకత్వంలో నడుంబిగించి నియంతృత్వపు నియమాలను అతిక్రమించి, ప్రజలందరూ సంఘటితంగా ఉద్యమించారు. అందులో ప్రజలందరూ మేము సైతం అంటూ చేయూత నిచ్చి భాగస్వాములయ్యారు. అదిగో లక్షల కొలది ప్రజానీకం... రక్తం ఉడుకెత్తించే ఉపన్యాసాలు... వందే మాతరం... వందే మాతరం అంటూ నినదించారు. వందల ఏండ్లుగా బానిసత్వంలో బాధలు పడుతున్న దేశభక్తులు తమ సర్వస్వం ధారబోసి, స్వాతంత్ర్య సంగ్రామంలో దూకి, సత్యాగ్రహోద్యమాలలో లాటి దెబ్బలు తిని, కారాగారాల్లో మ్రగ్గి, ఉరి త్రాళ్లతో ఉయ్యాలలూగి, స్వతంత్ర జాతిగా మనల్ని రూపొందించారు. ఈ దేశం ప్రజలందరి సొత్తు. దీని మీద అధికారం అందరిదీ. ఈ నిజాన్నీ మనం ఆచరణలో చూపడానికే అకుంఠిత దీక్షతో, మానవాళి లొంచి మహా మనీషులను సృష్టించారు. వారికీ వీరరసం మెక్కించి, అమిత చాతుర్యంతో, సమయస్ఫూర్తితో కుటిల నియంతల విదేశీపాలన అంతం చేసేందుకు కృషిచేసారు. అందులో మహావీరులు, వీరనారీమణులు అందరూ కలసికట్టుగా స్వాతంత్ర్య సమర మహోద్యమంలో ఒక త్రాటిపై నిలబడ్డారు. వారంతా దేశస్వాతంత్ర్యం కొరకై పాటుపడిన మహనీయులు ఛత్రపతి శివాజీ, అల్లూరి సీతారామరాజు, తాంతియాతోపీ, భగత్‌సింగ్, లాలాలజపతిరాయ్, బాలగంగాధర్ తిలక్, సుభాష్ చంద్రబోసు, చక్రవర్తి రాజగోపాలాచారి, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయి పటేల్, రుద్రమదేవి, చానమ్మ, జిజియాబాయి, ఝూన్సీరాణి, అనిబిసెంట్, సిస్టర్ నీవేదిత, డా|| సరోజినీనాయుడు, దుర్గాబాయి దేశ్‌ముఖ్, సూర్యదేవర రాజ్యలక్ష్మి అతివాదులు, మితవాదులు వారి నైజాన్ని ప్రక్కకు పెట్టి వాదనలు ఏమైనప్పటికీ దేశ స్వాతంత్ర్యమే తమ ముందున్న లక్ష్యంతో కొన్నేండ్లు స్వాతంత్ర్య పోరాటం సాగించి, భారతీయులలో విజ్ఞాన జ్యోతుల్ని వెలిగించి, విభజించి పాలించాలనే ఆంగ్లేయుల కుటిల నీతిని, తుదముట్టించారు. ఆనాడు దేశమంతా గాంధీమహాత్ముడి అడుగు జాడల్లో నడిచింది. ఆయన పిలుపు నిస్తే స్పందించింది. ఆదేశిస్తే శిరసావహించింది. నూలు వడికింది. ఖద్దరు కట్టింది. జైలు బాట పట్టింది. ప్రాణ త్యాగాలకు సిద్ధపడింది. అపూర్వ సత్యాగ్రహ సమరంలో, అహింసా విధానంతో అంతం చేసి, భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని సంపాదించుకున్నాం.

## నాటి పోరాట పటిమేది?

నేడు ప్రజలంతా నేనే నా ప్రపంచం! అన్న పోకడల నేపథ్యం. నేను వేరు నా దేశం వేరు. దేశమెట్లాన్న పోనీ, నేను బాగుంటే చాలన్న ప్రమాదకమైన ప్రవృత్తి. కనీసం ప్రజాసామ్యానికి పునాదిలాంటి ఎన్నికలు కూడా జనం తేలిగ్గా తీసుకుంటున్నారు. పోలింగ్ తేదిని అచ్చమైన సెలవు దినంగా భావిస్తున్నారు. ఆ నిర్లిప్తత కారణంగా పోలింగ్ శాతం గణనీయంగా తగ్గిపోతోంది. తద్వారా 30 శాతం నుండి 40 శాతం వరకు పోలింగ్ జరిగినప్పుడు అందులో అత్యధిక మెజారిటీ కలిగిన రాజకీయ పక్షాలు వరిపాలన చేవడుతున్నాయి. దీనివల్ల ప్రజాస్వామ్య స్ఫూర్తి బలహీనపడుతుంది. ఎన్నికల ఫలితాలు ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించవు. సమర్థులకే విజయం వరిస్తుందన్న బరోసా ఉండదు. బలహీనమైన ప్రభుత్వాలు ఏర్పడతాయి. మెజారిటీ నాయకుడి సమయమంతా తనకు లభించిన అధికార పీఠాన్ని నిలబెట్టుకోడానికే సరిపోతుంది. ప్రభుత్వ పరిపాలనా నిర్ణయాల్లో దార్శనికత ఉండదు. ఏ పనిచేసిన, ఏ నిర్ణయం తీసుకోవాలన్న ఓటర్లను వలలో వేసుకోడానికే. ఇప్పుడు ప్రభుత్వాలు చేస్తున్న పనినే అప్పట్లో బ్రిటీష్ ప్రభుత్వం చేసింది. ప్రజాస్వామ్యయుత భారత స్వాతంత్ర్య దేశంలో భారత రాజ్యాంగం ప్రకారం ప్రజలకు కల్పించిన సౌకర్యం ఓటు హక్కును వినియోగించుకోవడం. తద్వారా సవ్యంగా పరిపాలన చేయని వ్యక్తిని తమ ఓటు హక్కు వినియోగించుకుని తొలగించుకునే అవకాశం కల్పించింది. ఆ విషయం పట్ల కనీస జ్ఞానం లేని యువత నేడు సమాజంలో ఓటు హక్కును వినియోగించుకోలేని నిర్లక్ష్యం. ఈ తరహా ద్వైదీభావంతో ప్రజలుంటే ఆ దేశానికీ ప్రమాదకరం.

స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో, అక్షర జ్ఞానంలేని సామాన్య ప్రజలు సైతం ఇలా ఆలోచించలేదు. తామే దేశమనుకున్నారు. దేశమే తామని భావించారు. తెల్లవాళ్ళు దేశాన్ని కొల్లగొడుతుంటే కుత కుతా ఉడికిపోయారు. ఇది మా దేశం. మేమే పాలించుకుంటాం. మీరిక దయచేయండి అని నినదించారు. స్వాతంత్ర్య సంగ్రామ మహోద్యమంలో యావత్ భారతదేశ ప్రజానీకం, స్వేచ్ఛకోసం, ఉద్యమాల జెండాపట్టిన జాతి నేడు 'నేను నాదీ' అన్న భావనకు బందీ అయిపోతుంది. ఒకప్పుడు.... స్వరాజ్య నిధి కోసం ఒంటిమీది ఆభరణాల్ని ఒలిచిఇచ్చిన జనం. నేడు తరాలకు సరిపడా సంపదల్ని పోగేసుకునే ఆరాటం. ఒకప్పుడు హక్కుల కోసం గొంతెత్తిన సమూహాలు, నేడు బాధ్యతల్ని విస్మరించి ప్రవర్తిస్తున్నాయి. స్వాతంత్ర్య పోరాట చరిత్రను ఒక్కసారి నేమరేసుకుంటే... యువతకు తాము చేస్తున్న తప్పు ఏమిటో తెలుస్తుంది.

తద్వారా నాటి పోరాట పటిమ స్ఫూర్తివంతమౌతుంది. యువతీ యువకుల్లారా మేల్కోండి. ఈ దేశం మనది, ఈ రాష్ట్రం మనది, భవిష్యత్‌లో భారతదేశ అభివృద్ధికి తోడ్పడండి.

జై భారత్! జై హింద్!



-శారద శృంగేరి
9490 26 1119

# చిమ్మపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువ కవి సమ్మేళనంకు ఆహ్వానం

హైదరాబాద్, ఆగష్టు 14: సెప్టెంబర్ 14 ఉదయం9-30గం.కు ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువ కవి సమ్మేళనం టి.జి.సభ కళా సుబ్బారావు కళా వేదికపై నిర్వహించబడుతుంది.వచన కవితా రచన పోటీలలో పాల్గొని బహుమతులు గెలుచుకున్న విద్యార్థులకు గౌరవ అతిథులచే బహుమతి ప్రదానం జరుగుతుంది .35సం.ల లోపు వయసున్న కవులు, కవయిత్రులు కవి సమ్మేళనం లో పాల్గొనడానికి 9704177270 నెంబర్ కు ఫోన్ చేసి సెప్టెంబర్ 2వతేదీ లోగా పేర్లు నమోదు చేసుకోవలసిందిగా చిమ్మపూడి ఫౌండేషన్ విజ్ఞప్తి చేస్తోంది.

# రాజీవ్ జ్యోతి కి గాంధీ భవన్ లో ఘన స్వాగతం పలికిన కాంగ్రెస్ నాయకులు..

హైదరాబాద్ ఆగస్టు 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ప్రతి ఏటా శ్రీ పేరంబదూర్ నుంచి ఆగస్టు 20 రాజీవ్ గాంధీ జయంతి నాటికి ఢిల్లీకి చేరుకునే విదంగా చేపట్టే యాత్ర ఈ రోజు హైదరాబాద్ కు చేరుకుంది. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ గారి సూచన మేరకు యాత్ర కు గాంధీ భవన్ లో ఘన స్వాగతం పలికారు. డీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి, ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ , ఉపాధ్యక్షులు కుమార్ రావ్, నాంపల్లి ఇంచార్జ్ ఫిరోజ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## దొంగ ఓట్లతో గెలవడం కూడా గెలుపేనా?

అమరావతి ఆగష్టు 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ : పులివెందుల ఎన్నికల్లో నిజమైన ఓటర్ ను అసలు పోలింగ్ బూత్ లోకే పోనివ్వలేదని వైసిపి మాజీ ఎంపి అవినాష్ రెడ్డి తెలిపారు.

పులివెందులలో రిగ్గింగ్ జరిగిందని అన్నారు. పులివెందుల జెడ్ పిటిసి ఉప ఎన్నికలలో వైసిపి ఓటమి చెందిన సందర్భంగా అవినాష్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ..అసలు దీన్ని ఎలక్షన్ అంటారా.. అని దొంగ ఓట్లతో గెలవడం కూడా గెలుపేనా..అని ప్రశ్నించారు. పోలీసులు, టిడిపి శ్రేణులు ఓటర్ల స్లిప్పులు లాక్కున్నారని విమర్శించారు. టిడిపికి గుణపాఠం చెప్పే రోజు వస్తుందని హెచ్చరించారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: BAISA DEVADAS.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com

# అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఘనంగా ముందస్తు శ్రీకృష్ణాష్టమి ఉత్సవాలు

## –శ్రీకృష్ణ, గోపిక వేషధారణలో ఆకట్టుకున్న విద్యార్థులు




కరీంనగర్, ఆగష్టు 14: (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ లోని కొత్తపల్లిలో ని అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాల, వావిలాలపల్లిలో అల్ఫోర్స్ టైనీ టాట్స్ , అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్ నెక్స్ట్, కిసాన్ నగర్ లో అల్ఫోర్స్ హై స్కూల్, భగత్ నగర్ లో అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్, మంకమ్మతోటలో గల అల్ఫోర్స్ ప్లానెట్ కిడ్స్ లో వేడుకగా నిర్వహించినటువంటి ముందస్తు శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. దీనికి ఆల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి నరేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. ప్రారంభానికి ముందు వారు ప్రాంగణంలో అందంగా అలంకరించినటువంటి శ్రీకృష్ణుని విగ్రహానికి పూజ కార్యక్రమాన్ని నిర్వహించి, వివిధ పూలమాలలను సమర్పించి కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనదేశంలోనే కాకుండా ప్రపంచంలో ఈ పండుగను వేడుకగా జరుపుకుంటారని చెప్పారు. శ్రీకృష్ణుని చరిత్ర చాలా విశిష్టమైన దని, ధర్మము గురించి తెలిపినటువంటి విషయాలు ఆలోచింప చేస్తాయని వారు చెప్పారు. శ్రీకృష్ణాష్టమిని గోకులాష్టమి జన్మాష్టమని కూడా పిలుస్తారని, శ్రావణ మాసం కృష్ణపక్షంలోని 8వ రోజున వేడుకలను చాలా వైభవంగా నిర్వహించుకోవడం జరుగుతుందని చెప్పారు. కృష్ణాష్టమి పరిష్కరించుకుని పలు ఆలయాల్లో శ్రీకృష్ణుని విగ్రహాలకు వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేక కార్యక్రమాన్ని చాలా వైభవపేతంగా నిర్వహిస్తామని, స్వామివారిని ఉయ్యాలలో వేసి ఊపుతానని ఈ ఘట్టం అపూర్వమైనదని అనందాన్ని ఇస్తుందని వారు చెప్పారు. చిన్నారులందరు శ్రీకృష్ణ వేషధారణలో సమూహంగా ఏర్పడి ఉట్టి వేడుకలలో పాల్గొంటారని, ముఖ్యంగా శ్రీ కృష్ణ జన్మస్థలమైన మధురలో వారం రోజులపాటు సందడిగా ఈ కార్యక్రమాలను వేడుకగా నిర్వహించడమే కాకుండా పలు భజనలు కీర్తనలను, శ్రీకృష్ణ వైభవాన్ని తెలిపినటువంటి చరిత్రను చదువుతారని తెలిపారు. స్త్రీలు దాండియా ఆడుతూ పురుషులందరూ వివిధ రకాల వృత్యాలతో స్వామివారిని పూజిస్తారని వారు చెప్పారు. కార్యక్రమంలో భాగంగా 25 మంది విద్యార్థులు రాధా గోపిక వేషధారణలో విచ్చేశారు. పండుగ వాతావరణాన్ని అని రెట్టింపు చేశారు. వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు ముఖ్యంగా గోవర్ధన గొవ్వతనం నాటిక చాలా ఆలోచింపజేసింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారిపై చర్యలు తీసుకోవాలి..

వరంగల్, ఆగష్టు 14: వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారి మామిడి జ్ఞానేశ్వర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్జేడీ) కె.సత్యనారాయణరెడ్డికి ఉపాధ్యాయ సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా డీఈవో మామిడి జ్ఞానేశ్వర్ అకడమిక్ మానిటరింగ్ అధికారి (ఏఎంవో) పై కులం పేరుతో దుర్భాషలాడడం, 'తమాషా చేస్తు న్నావా?' అని బెదిరింపులకు గురిచేయడం హేయమైన చర్య అన్నారు. జిల్లా విద్యాశాఖను ముందుండి నడిపించాల్సిన స్థాయిలో బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తున్న అతని తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కూడా 'రిజర్వేషన్‌లో ఉద్యోగం వచ్చింది కాబట్టి గ్రీన్ పెన్ను పట్టుకుంటే సరిపోతుందా?' అని ఏఎంవో సుజన్‌తేజను అవమాన పరిచేలా మాట్లాడడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. అంతేకాకుండా ఉపాధ్యాయుల సర్వీస్ సమస్యల పట్ల నిర్లిప్త వైఖరి, ఉపాధ్యాయులను భయాందోళనలకు గురిచేసే విధంగా ప్రవర్తిస్తున్న డీఈవో తీరుపట్ల అసహనం వ్యక్తం చేశారు.

# కేరళ మోడల్ స్కూల్‌లో ముందస్తు శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 14:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని ఉపగడ్డ మరియు సాయి నగర్ వీధిలోగల కేరళ మోడల్ స్కూల్స్ లో ముందస్తు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారుశ్రీకృష్ణుని జననాన్ని స్మరించుకుంటూ కృష్ణ జన్మాష్టమిని ఆనందంగా జరుపుకున్నారుపలువురు విద్యార్థులు కృష్ణుడు మరియు రాధగా వేషధారణ చేయడం, భక్తి పాటలు పాడటం మరియు కృష్ణుడి జీవితాన్ని వర్ణించే నృత్య నాటకాలను ప్రదర్శించడం వంటి వివిధ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొన్నారు. జన్మాష్టమి ప్రాముఖ్యతను తెలియజేసే ప్రసంగాలు, శ్లోకాలు మరియు భక్తి పాటలతో కూడిన ప్రత్యేక కార్యక్రమాలు అందరిని ఎంతగానో ఆకట్టుకున్నాయి కృష్ణుడి వెన్నె తినే సన్నివేశం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణ గా నిలిచింది అనంతరం ఏర్పాటు చేసిన దహి హండి (ఉట్టి) కొట్టేందుకు విద్యార్థులు పోటీపడ్డారు .కృష్ణ జన్మాష్టమి వంటి పండుగలను జరుపుకోవడం వల్ల విద్యార్థులు భారతదేశ గొప్ప సాంస్కృతిక వారసత్వం మరియు విలువలను అభినందించడానికి సహాయపడుతుందని యాజమాన్యం తెలిపారు . కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ శ్రీ కృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యంతో పాటు ఉపాధ్యాయుని




## మహనీయుల అడుగుజాడల్లో ముందుకు సాగాలి

ఆదిలాబాద్, ఆగష్టు 14:స్వాతంత్ర భారత దేశం కోసం ఎందరో మహనీయుల త్యాగాల స్ఫూర్తితో నేటి యువత ముందుకు సాగాలని బీజేపీ నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పడిపెల్లి గంగాధర్ పిలుపునిచ్చారు. కుబీర్ మండల కేంద్రంలో గురువారం అఖండ భారత్‌కార్యక్రమంలో భాగంగా హిందూ వాహిని ఆధ్వర్యంలో అన్న బహుసాటే కూడలిలో కాషాయ జెండాను ఎగరవేసి మాట్లాడారు.

ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగా స్వతంత్ర భారతావని రూపుదిద్దుకొందని అన్నారు. మహనీయుల ను స్మరించుకొని వారి అడుగు జాడల్లో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హిందు వాహిని మండల శాఖ అధ్యక్షుడు నాగభూషణ్, బీజేపీ మండల అధ్యక్షుడు ఏశాల దత్తు, దొంతుల దత్తాత్రి, బోయిడి అభిషేక్, హిందు వాహిని కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

## నవంబరు 1 మొదలు నవంబరు 30 వరకు జాతీయ స్థాయి డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ (డీఎల్‌సీ) ప్రచార ఉద్యమం

న్యూఢిల్లీ, ఆగష్టు 14:పింఛనుదారులు జీవించే ఉన్నామని సూచించే సర్టిఫికెట్లను ఏటా నవంబరులో దాఖలు చేయాల్సి ఉంటుంది. ఇంతకు ముందు 'డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ (డీఎల్‌సీ) ప్రచార ఉద్యమం 3.0'ను 845 నగరాల్లో గతేడాది నవంబరులో నిర్వహించినప్పుడు 1.62 కోట్ల మంది డీఎల్‌సీలు దాఖలు చేశారు. పింఛను, పింఛనుదారుల సంక్షేమ విభాగం (డీఓపీపీడబ్ల్యూ) '4వ జాతీయ స్థాయి డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ ప్రచార ఉద్యమాన్ని' ఈ సంవత్సరం నవంబరు నెల 1–30 తేదీల మధ్య నిర్వహిం చనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలు, నగరాలు, పట్టణాలు కలుపుకొని భారత్ అంతటా 1,850 కన్నా ఎక్కువ చోట్ల 2,500 శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రచార ఉద్యమానికి సమగ్ర మార్గదర్శకాలను గత నెల 30న డీఓపీపీడబ్ల్యూ ప్రకటించింది. ఈ ప్రచార ఉద్యమాన్ని పింఛనును పంపిణీ చేసే బ్యాంకులు, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు, పింఛనుదారుల సంక్షేమ సంఘాలు, సీజీడీఏ, టెలికమ్యూనికేషన్ల విభాగం (డీఓటీ), రైల్వేలు, డీఓపీ, ఈపీఎఫ్ఓ, యూఐడీఏఐ, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (ఎంఈఐటీవై)ల సహకారంతో దేశంలో సుదూర ప్రాంతాల పెన్షనర్ల వద్దకు కూడా తీసుకుపోయే ఉద్దేశంతో చేపడుతున్నారు. త్వరలో ప్రారంభం కానున్న ప్రచార ఉద్యమానికి సన్నాహాలు ఏ స్థాయుల్లో ఉన్నాయో డీఓపీపీడబ్ల్యూ కార్యదర్శి శ్రీ వి. శ్రీనివాస్ ఈ రోజున సమీక్షించారు. ఐపీపీబీ తనకున్న 1.8 లక్షల మంది పోస్ట్‌మన్లు, గ్రామీణ డాక్ సేవక్‌ల విస్తృత బలగంతోను, 1600 జిల్లా, సబ్–డివిజనల్ పోస్టాఫీసుల్లోను శిబిరాలను నిర్వహించనుంది. డీఎల్‌సీ సేవలను ఇంటి ముంగిట కూడా ఐపీపీబీ అందించనుంది. పింఛనుదారులు శిబిరాలకు చేరుకొనేటట్లు 57 పింఛను సంక్షేమ సంఘాలు కీలక పాత్రను పోషించనున్నాయి. దేశమంతటా ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఇలాంటి శిబిరాలను సంబంధిత మంత్రిత్వ శాఖలు, విభాగాలు అంటే.. రైల్వేల మంత్రిత్వ శాఖ, రక్షణ శాఖ (సీజీడీఏ). తపాలా విభాగం, టెలికమ్యూనికేషన్ల విభాగం, ఈపీఎఫ్ఓ కూడా ఏర్పాటు చేయనున్నాయి.

## నేడు నగరాల్లో మద్యం షాపుల బంద్

హైదరాబాద్, ఆగష్టు 14:దేశ వ్యాప్తంగా రేపు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. హైదరాబాద్ మహానగరం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో శాంతి, భద్రతలకు విఘాతం కలుగకుండా ఉండేందకు మద్యం అమ్మకాలు నిలిచిపోనున్నాయి. వైన్ షాపులు ఆగస్టు 15వ తేదీన మూతపడున్నాయి. బార్స్, పబ్స్, మందు సప్లై చేసే రెస్టారెంట్లు రేపు మూతపడున్నాయి. హైదరాబాద్‌తో పాటు ఢిల్లీ, ముంబై, బెంగళూరు లాంటి నగరాలు కూడా డ్రై డే పాటించనున్నాయి.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.** RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com